بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ (ఆలె ఇమ్రాన్:124)

**సంపాదకులు:** సయ్యద్ రసూల్ నియాజ్

**ఉపసంపాదకులు:** ముహమ్మద్ అక్బర్

# బదర్

తెలుగు వార పత్రిక

Weekly **BADAR** Qadian **Telugu**

సంపుటి 5

సంచిక 21

వార్షిక చందా 500/-రూ॥

www.akhbarbadrqadian.in

**21 మే 2020, 27 రమజాన్ 1441, హి.ఖ, 21 హిజ్రత్ 1399, హి.శ.**

## అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్, అల్లాహ్ తాలా దయతో క్షేమంగా యున్నారు. **(అల్ హందులిల్లాహ్)**

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ గారి ఆయురారోగ్యముల కొరకు, ఉన్నత ఆశయ సాధనాల కొరకు, వారి ప్రత్యేక రక్షణ కొరకు దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ ను అనుక్షణం రక్షించుచూ దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! (ఆమీన్).

اَللّٰھُمَّ اَیِّدۡ اِمَامَنَا بِرُوۡحِ الۡقُدُسِ
وَبَارِکۡ لَنَا فِیۡ عُمُرِہٖ وَاَمۡرِہٖ

## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

یٰۤاَیُّہَا الَّذِیۡنَ اٰمَنُوا
اصۡبِرُوۡا وَصَابِرُوۡا وَرَابِطُوۡا ۟
وَاتَّقُوا اللّٰہَ لَعَلَّکُمۡ تُفۡلِحُوۡنَ

" ఓ విశ్వాసులారా! సహనము వహించుడు. సహనము వహించుటకు బోధించుడు. సరిహద్దులను జాగరూకులై కాపాడుడు. మీరు విజేయులగుటకు ధర్మ బద్ధులై ప్రవర్తింపుడు." (ఆలే ఇమ్రాన్: 201).

**రమజాన్ మాసపు ఈ చివరి దశకంలో గతంలో కన్న ఎక్కువగా అల్లాహ్ సన్నిధిలో మోకరిల్లండి. విధేయతతో కూడిన దుఆలు చేయండి. అల్లాహ్ తాలాతో అతని అనుగ్రహాన్ని కరుణను యాచించండి. అల్లాహ్ తాలా ప్రతి అహ్మదీయుడికి ఇందుకు అవకాశంను కల్పించుగాకా!.**

## సయ్యదినా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారి ఆరోగ్యమును గూర్చిన సమాచారం:

దివి: 15 మే 2020 శుభప్రదమైన జుమా రోజున అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు అల్ వదూద్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు జుమా ప్రసంగంను ప్రసంగించలేదు. ఈ రోజును పురస్కరించుకొని కేవలం అంతర్జాతీయ్య అహ్మదియ్య ముస్లిం జమాఅత్ సభ్యులనుద్దేశిస్తూ ఒక సందేశాన్ని అందించారు. ఆ సందేశమును హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ గారి ప్రైవేట్ కార్యదర్శి గౌ॥ మునీర్ అహ్మద్ జావేద్ గారు ఎం.టి.ఏ మాధ్యమం ద్వారా జమాఅత్ సభ్యులకు చదివి వినిపించడం జరిగింది.

**హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహు తాలా అల్ వదూద్ బినస్రిహిల్ అజీజ్ గారు ఈ విధముగా తెల్పినారు:**

" ఈ రోజు నేను జుమా ప్రసంగంను ఇవ్వలేక పోవుచున్నందుకు నాకు చాలా బాధగా ఉంది. ఎందుకనగా కొన్ని రోజుల క్రితం ఇంటి ప్రాంగణంలో నడుస్తూ ఉండగా, కాలుకు చాప తగలడం వలన నా కాళు అదుపుతప్పి జారిపోయింది. ఫలితముగా గచ్చు చేయబడిన నేలపై పడినందున నా నుదుటికి, ముక్కుకు చాలా దెబ్బలు తగిలాయి. అందువలన జుమా చదువించడం కష్టమవుతుంది. డాక్టర్లు కూడ విశ్రాంతి తీసుకోవాలని సూచనలు చేశారు. అల్లాహ్ తాలా త్వరగా పూర్తి స్థాయిలో స్వస్థతను చేకూర్చాలని దుఆలు చేయండి. రాబోవు జుమా నమాజ్‌ను ఇన్షా అల్లాహ్ చదువించెదను.

అదే విధముగా ఇది రమజాన్ మాసపు చివరి దశకం. ఈ దశకంలో జమాఅత్ కొరకు కూడ అధికముగా దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా జమాఅత్‌ను అన్ని రకాల దుష్టత్వముల నుండి కాపాడుగాకా!, తన రక్షణతో జమాఅత్‌ను కాపాడుగాకా!. ఈ రోజులలో పాకిస్తాన్ దేశపు రాజకీయ నాయకులు, మీడియా ప్రతినిధులు జమాఅత్‌ను వ్యతిరేకించుటలో చాలా ఉత్సాహంను ప్రదర్శిస్తున్నారు. అల్లాహ్ తాలా మరియు అతని సందేశహరుడు హజ్రత్ ఖాతముల్ అన్బియా ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి పేరుతో రాజకీయాలు చేస్తున్నారు. ఈ ఆంశమునే పునాదిగా మలుచుకుంటూ ఎక్కువగా అహ్మదీయులను లక్ష్యముగా చేసుకొనుటకు ప్రయత్నించడం జరుగుతుంది. అల్లాహ్ తాలా అహ్మదీయులను మరియు జాతి మొత్తాన్ని వారి ఈ నాటకీయ పరిణామాల దుష్ప్రభావాల నుండి కాపాడుగాకా!. మొత్తానికి వారు చేసే ప్రతి దాడికి సమాధానముగా దుఆలు చేయడం, అల్లాహ్ తాలా ముందు మోకరిల్లడమే మన కర్తవ్యం కావలెను. రమజాన్ మాసపు ఈ చివరి దశకంలో గతంలో కన్న ఎక్కువగా అల్లాహ్ సన్నిధిలో మోకరిల్లండి. విధేయతతో కూడిన దుఆలు చేయండి. అల్లాహ్ తాలాతో అతని అనుగ్రహాన్ని కరుణను యాచించండి. అల్లాహ్ తాలా ప్రతి అహ్మదీయుడికి ఇందుకు అవకాశంను కల్పించుగాకా! "

**ఆ తరువాత గౌ॥ డాక్టర్ షబ్బీర్ భట్టి గారు హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారి ఆరోగ్య సమాచారంను జమాఅత్ సభ్యులకు చదివి వినిపించారు.**

" బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం. అస్సలాము అలైకుం వరహ్మతుల్లాహి వబరకాతహు. హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ గారు క్రిందపడిపోవడం వలన నుదిటిపై మరియు మోకళ్ళకు దెబ్బలు తగిలాయి. దేవుని దయ వలన ఆ దెబ్బలన్ని పై పైనే తగిలాయి. నుదిటిపై గాని మరే ఇతర అవయవాలకు గాని ఎలాంటి గట్టి దెబ్బలు తగలేదు. కొద్ది మేరకు వాపు వాచింది. అనగా ఆయా భాగాలు ఉబ్బుగా ఉన్నాయి. కాని అవి కూడ నెమ్మది నెమ్మదిగా తగ్గిపోతున్నాయి. ఇన్షా అల్లాహ్ త్వరలోనే పూర్తిగా స్వస్థత చేకూరును. హుజూర్ ఎలాంటి ఇబ్బంది లేకుండానే నడుస్తున్నారు. సాధారణముగా వారి పరిస్థితి చాలా మేరుగ్గా ఉన్నది. అల్ హందులిల్లాహ్. కొన్ని రోజులు విశ్రాంతి తీసుకోవాలని, జుమా నమాజ్ చదువించ కూడదని హుజూర్ అయ్యదహుల్లాహ్ తాలా తో విన్నవించుకోగా, హుజూర్ ఈ విన్నపమును మన్నిస్తూ ఆమోదించారు. జజాకుముల్లాహ్. "

**హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారి ఆరోగ్యమును గూర్చిన తాజా సమాచారం: (17 మే 2020, ఆదివారము).**

అల్లాహ్ తాలా అనుగ్రహం వలన నేడు హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా గారి ఆరోగ్యముగా గతంలో కన్న మేరుగగా ఉన్నది. దెబ్బలు తగిలిన చోట నొప్పి కూడ తగ్గిపోయింది. నుదిటి, ముక్కు మరియు మోకాళ్ళపై తగిలిన దెబ్బలు కూడ పూర్తిస్థాయిలో తగ్గు ముఖము పట్టాయి. (అల్ హందులిల్లాహ్).

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా ఉత్తరములను కూడ పరిశీలిస్తున్నారు. జమాఅత్ సభ్యులందరి కొరకు దుఆలు చేస్తూన్నారు. మీరు కూడ మన ప్రియమైన హుజూర్ గారి కోసం మనస్ఫూర్తిగా దుఆలు చేయండి. అల్లాహ్ తాలా తన ప్రత్యేక అనుగ్రహంతో హుజూర్ గారికి పూర్తి స్థాయిలో స్వస్థత చేకూర్చును గాకా! ఫలితముగా జమాఅత్ సభ్యులు రాబోవు శుక్రవారము మన ప్రియమైన హుజూర్ గారిని కన్నులారా చూసుకొను భాగ్యమును పొందురు గాకా!.

జమాఅత్ సభ్యులు తమ అత్యంత ప్రియమైన మరియు కరుణా స్వభావులైన ఇమాం అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ గారికి త్వరగా పూర్తి స్థాయిలో స్వస్థత చేకూరాలని ప్రత్యేక దుఆలు చేయగలరు.

اَللّٰھُمَّ رَبَّ النَّاسِ اَذۡھِبِ الۡبَاسَ اِشۡفِ اَنۡتَ الشَّافِیۡ لَا شِفَاءَ اِلَّا شِفَاءُکَ شِفَاءً لَّا یُغَادِرُ سَقَمًا

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

**సంపాదకీయం :-**

స్వచ్ఛమైన ప్రాయశ్చిత్తమునకు ఏమి చేయవలసి ఉంటుంది?.అనే ఆంశంను గూర్చి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మూడు విషయాల వైపు మనకు శ్రద్ధను కల్పించడం జరిగింది.

మొదటి విషయమేమనగా, ప్రతి చెడు భావన, ప్రతి చెడు ఆలోచన ముందుగా మానవుని మెదడులో జనిస్తుంది. కావున తమ మెదడును సాధ్యమైనంత మేరకు పవిత్రముగా ఉంచుకోనంత వరకు స్వచ్ఛమైన ప్రాయశ్చిత్తము లభించదు. అస్తఘ్ఫిరుల్లాహి రబ్బి మిన్ కుల్లి జంబిన్ వఅతూబు ఇలైహి అనే పదాలను మెదడు యొక్క భావాలు అనుసరించకుండా కేవలం నోటితో ఈ పదాలను పలికినంత మాత్రమున ఎలాంటి ప్రయోజనం చేకూరదు.

రెండవ విషయమేమనగా ఒకవేళ ఏదేని తప్పిదము లేదా చెడు జరిగినచో, లేదా మెదడులో చెడు ఆలోచనలు అతిగా వస్తున్నచో , వాటిని అదుపు చేయలేక పోవుచున్నచో వాటిని ఎట్టి పరిస్థితులలోనైన ఆ ఆలోచనలను దూరం చేసుకొనుటకు ప్రయత్నిస్తూ, జరిగిన వాటికి మానవుడు సిగ్గుపడుతూ, ఆవేదన చెందాలి. పాపములనగా కేవలం పెద్ద పెద్ద పాపములే కావు, అన్ని రకాల చెడులు, ఇతరుల హక్కులను హరించివేయడం, ఇతరులను చెడు పేర్లతో పిలువడం వంటి వన్నియు కూడ పాపపు పరిదిలోకే వచ్చును. ఇవియే ప్రాయశ్చిత్తమును స్వీకరింపబడకుండా అడ్డుకుంటాయి.

అనేక మంది కోర్టు వ్యాజ్యాలలో ఇతరుల హక్కులను హరించి వేయుటకు ప్రయత్నిస్తారు. చివరికి తోడబుట్టిన అన్నదమ్ములే ఒకరి హక్కులను మరొకరు హరించి వేయాలని చూస్తుంటారు. భార్య భర్తలు ఒకరినొకరు మోసం చేసుకుంటూ ఉంటారు. ఇలాంటి చెడు పనులు చేస్తూ మేము ప్రాయశ్చిత్తం చేస్తున్నాము, అల్లాహ్ తాలా మమ్ములను క్షమించివేస్తాడని భావించడం తప్పుడు ఆలోచనయే అగును. ఇది మానవుని దురాలోచనయే అగును. ఒకవేళ ఒక చిన్న తప్పిదము జరిగినను జరిగిన తప్పిదానికి సిగ్గుపడుతూ, ఆవేదన చెందినప్పుడే నిజమైన మరియు స్వచ్ఛమైన ప్రాయశ్చిత్తము అనబడును.

మరల మూడవ విషయమేమనగా, ప్రాయశ్చిత్తము చేయు వ్యక్తి నేను అన్ని రకాల చెడులను పూర్తిగా వదిలివేయుదును అనే ఒక గట్టి సంకల్పాన్ని ఏర్పర్చుకోవాలి. ఒకవైపు అస్తఘ్ఫార్ చేస్తూనే మరోవైపు ఇది రమజాన్ మాసం, కొంత కాలం తప్పులు చేయకుండా ఉందాము, ఇతరుల హక్కులను హరించి వేయకుండా ఉందాము. రమజాన్ మాసం తరువాత మనం చూసుకుందాము అనే ఆలోచనలను కల్గియున్నచో మనోభావాలను అర్థం చేసుకొనునట్టి అల్లాహ్ అట్టి ఆలోచనలు కల్గినట్టి ప్రజలను క్షమించు విషయంలో ఎలాంటి శ్రద్ధను చూపించడు. తౌబహ్-ఏ- నసూ్హ అనగా స్వచ్ఛమైన ప్రాయశ్చితము చేయమని అల్లాహ్ తాలా ఎంతో స్పష్టముగా తెలియజేయుచున్నాడు. ఎలాంటి మోసపూరిత మాటలు ఉండకూడదు. అల్లాహ్ తాలాను ఎవరు కూడ మోసం చేయలేరు.

ప్రాయశ్చిత్తము చేసుకొనువారు ఈ మూడు విషయాలను తమలో కల్పించుకున్నచో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తెల్పినట్లుగా అల్లాహ్ తాలా వారికి స్వచ్ఛమైన ప్రాయశ్చిత్తము చేసుకొను భాగ్యమును కల్పించును. ఫలితముగా అతనిలోని చెడులన్ని దూరమై, సద్గుణాలు, సత్ప్రవర్తనలు వాటి చోటును తీసుకుంటాయి. సద్గుణాలపై ఇదొక విజయము అనబడును. ఆపై శక్తి సామర్థ్యములను అనుగ్రహించడం అల్లాహ్ తాలా బాధ్యత. ఎందుకనగా అన్ని రకాల శక్తి సామర్థ్యాలకు అతడే యజమాని. కావున చెడులను సద్గుణాలుగా మార్చునట్టి ఈ స్వచ్ఛమైన ప్రాయశ్చిత్తమును గూర్చి అల్లాహ్ తాలా పవిత్ర ఖుర్ఆన్‌లో ఈ విధముగా తెలియజేశాడు. మన్ తాబ వా ఆమన వ అమిలా స్వాలిహన్ ఫ ఉలాయిక యుబద్దిలుల్లాహు సయ్యిఆతిహిం హసనాతిన్ వకానల్లాహు ఘఫూర ర్రహీమ (ఫుర్కాన్: 71). అనగా ప్రాయశ్చితం చేయువారు, విశ్వసించువారు, సత్కార్యములు చేయువారి చెడులనే అల్లాహ్ తాలా సద్గుణాలుగా మార్చివేయును. అల్లాహ్ అధికముగా క్షమించువాడు, పదే పదే కరుణించువాడు.

ఇలాంటి మార్పును కల్పించుకోవలసిన అవసరం ఉన్నది. ముందుగా మనోభావాలను పవిత్రం చేసుకోవడం కోసం అస్తఘ్ఫార్‌లతో పాటు ప్రయత్నాలు కూడ చేయాలి. ఆ తరువాత చిన్న చిన్న తప్పిదాలపై కూడ తప్పుచేశాననే బాధ, ఆవేదన కలగాలి. ఆ తరువాత ఎలాంటి పరిస్థితులు ఎదురైనను, ఎలాంటి ఆశలు చూపినను చెడుల దరికి చేరకూడదనే ఒక గట్టి సంకల్పాన్ని కల్గి ఉండాలి. ఆపై తమ ప్రతి పని, ప్రతి కార్యము అల్లాహ్ తాలా ప్రీతికి అనుగుణముగా ఉండునట్లుగా ప్రయత్నించాలి. ఈ ఉపవాస రోజులు అందుబాటులో ఉన్నందున ఈ మాసంలో మానవుడు సహనంను, త్యాగాన్ని అలవర్చుకొను శిక్షణను తీసుకొనుటకు ప్రయత్నించును. రోజాల శుభముల నుండి అనుగ్రహాన్ని పొందుటకు ఈ ప్రయత్నాలే ఫలితాన్నిచ్చును. ఇలాంటి ప్రయత్నాలు చేయవలెయును. అప్పుడే క్షమాపణలతో కూడిన దశకం క్షమింప జేయుటకు తగిన సామాగ్రిని ఏర్పాటు చేయును. కేవలం మధ్య దశకమే గాకుండా, చివరి దశకం కూడ మానవునికి క్షమాపణ కల్పించు సామాగ్రిని ఏర్పాటు చేయును. కేవలం రమజాన్ మాసమే గాకుండా తరువాత వచ్చునట్టి ప్రతి మాసం కూడ, ప్రతి సంవత్సరం మరియు ప్రతి సంవత్సరములో వచ్చునట్టి ప్రతి రోజు కూడ క్షమింపజేయు సామాగ్రిని కల్పించును. కావున మధ్య దశకం క్షమింపజేయు దశకమని ఆ॥ హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తెల్పిన ఉపదేశము వెనుక ఉన్నటు వంటి ఈ స్ఫూర్తిని అర్థము చేసుకుంటూ, అందుకు అనుగుణముగా నడుచుకొనుటకు మనము ప్రయత్నం చేయవలెను.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెల్పినారు: " దాసుడు స్వచ్ఛమైన మనస్సుతో దేవుని వైపు శ్రద్ధను కనబర్చుతున్నప్పుడు దేవుడు దాసుని పట్ల శ్రద్ధ చూపడనే విషయాన్ని విజ్ఞత ఎందుకు ఆమోదిస్తుంది. వాస్తవానికి అత్యంత కరుణామయుడైన, దయామయుడైన ఆ అల్లాహ్ దాసుడికన్న ఎన్నో రెట్లు ఎక్కువగా అతని వైపు శ్రద్ధను కనబర్చును. అందుకోసమే పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ తాలా పేరు .... తవ్వాబ్ అని పేర్కొనడం జరిగింది. అనగా అధికముగా శ్రద్ధను కనబర్చువాడు. కావున దాసుని శ్రద్ధ కేవలం తప్పిదము, సిగ్గు, ఆవేదన, ఆత్రుతతో కూడినదై యుండును. కాని దేవుని శ్రద్ధ కరుణామ యముగా, క్షమాప్రాయముగా ఉంటుంది." (చశ్మయే మఅరుఫత్, రూహాని ఖజాయిన్ సంపుటి 23, పుట 133-134, ప్రచురణ లండన్).

కావున మనలో ఎవరైతే నిజమైన అస్తాఘ్ఫార్‌లు చేయుచూ, స్వచ్ఛమైన ప్రాయశ్చిత్తము ఆశించుతూ, ఈ శుభప్రదమైన రమజాన్ మాసంలో ఆయా శుభాల ప్రభావాలను తమలో చూసుకుంటూ, దేవుని యొక్క కరుణా మరియు క్షమాగుణాలతో ప్రభావితులవుదురో వారు చాలా అదృష్టవంతులు. ఒకవేళ అలసత్వ మవుచున్నచో అది కేవలం దాసుల వైపు నుండే అవుతుంది. నిర్లక్ష్యమవుచున్నచో అది కూడ దాసుల వైపు నుండే అవుతుంది. లేనిచో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం తెల్పినట్లుగా అల్లాహ్ తాలా దాసుని కన్న ఎక్కువగా అతని వైపు శ్రద్ధను కనబర్చుతాడు. ఈ విషయమునే అల్లాహ్ ఒక చోట ఈ విధముగా తెల్పుచున్నాడు. దాసుడు తన వద్దకు రావాలని, ప్రాయశ్చిత్తం చేసుకోవాలని అల్లాహ్ తాలా ఎదురు చూస్తుంటాడు. ఈ విషయాన్నే అల్లాహ్ తాలా ఈ విధముగా కూడ తెల్పుచున్నాడు. వల్లాహు యురీదూ అన్‌యతూబ అలైకుం (నిసా: 28) అనగా మిమ్ములను కరుణించాలని అల్లాహ్ తాలా ఎదురు చూస్తున్నాడు. మీ ప్రాయశ్చిత్తమును స్వీకరిస్తూ మిమ్ము సత్కరించాలని చూస్తున్నాడు. కావున ఏ పనినైతే అల్లాహ్ తాలా మీ కోసం ఎంచుకున్నాడో, దానిని పూర్తి చేయాలని కోరుకుంటున్నాడో దానిని పూర్తి చేయకుండా ఎలా ఉండగలడు. అందుకే అస్తాఘ్ఫార్‌లు చేస్తూ దేవుని సన్నిధిలో మోకరిల్లడం ఇది దాసుని కర్తవ్యం. ఆ తరువాత దేవుడు ఏ విధముగా శ్రద్ధను కనబర్చుతూ అతని వైపు వచ్చునో చూడండి.

(11వ పేజిలో చదవండి)

# జుమా ప్రసంగం

నేడు బద్రి అనుచరులలో హజ్రత్ ముఆజ్ బిన్ హారిస్ రజి గురించి నేను ప్రస్తావింతును. హజ్రత్ ముఆజ్ రజి అన్సార్‌లోని ఖజ్రజ్ తెగకు చెందిన బనూమాలిక్ బిన్ నజ్జార్ వంశస్థులు. హజ్రత్ ముఆజ్ రజి తండ్రి పేరు హారిస్ బిన్ రఫాఅ కాగా, తల్లి పేరు అఫ్రా బిన్తె ఉబైద్ . హజ్రత్ ముఆజ్ రజి బదర్ , ఉహద్‌లో పాల్గోంటూ తర్వాత జరిగిన యుద్ధములన్నింటిలో కూడ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి పాల్గొన్నారు.

హజ్రత్ ముఅమ్మర్ బిన్ హారిస్ రజి మక్కా నుండి ప్రస్థానము చేసి మదీనా వచ్చినప్పుడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారిని హజ్రత్ ముఆజ్ బిన్ హారిస్ రజి నకు సోదరులుగా అనుబంధమును ఏర్పర్చినారు.

హజ్రత్ ముఆజ్ బిన్ హారిస్ రజి నాలుగు వివాహములు చేసుకొనిరి. వాటి వివరములు ఇట్లు గలవు. హబీబా బిన్తె ఖైస్‌తో వీరికి ఒక కుమారుడు ఉబైదుల్లాహ్ జన్మించెను. వీరి రెండవ వివాహము ఉమ్మె హారిస్ బిన్ సబ్రహ్‌తో జరిగెను. ఈ భార్యతో హారిస్, ఔఫ్, సల్మా, ఉమ్మె అబ్దుల్లాహ్, రమ్లు జన్మించిరి. ఉమ్మె అబ్దుల్లాహ్ బిన్తె నుమైర్ వారి మూడవ భార్య. వీరితో ఇబ్రాహీమ్, ఆయిషా జన్మించిరి. ఉమ్మె సాబిత్ రమ్లు బిన్తె హారిస్ వీరి నాలుగవ భార్య. వీరితో సారహ్ జన్మించెను.

హజ్రత్ ముఆజ్ రజియల్లాహు అన్హు బదర్ యుద్ధములో గాయ పడిరి. వారు మదీనాకు తిరిగి వచ్చిన తరువాత ఆ గాయాల వలనే మృతి చెందారు. మరొక వ్యాఖ్యానము ప్రకారము వారు హజ్రత్ ఉస్మాన్ ఖిలాఫత్ హయాం వరకు బ్రతికే ఉన్నారు. మరొక కథనము మేరకు వారు హజ్రత్ అలీ ఖిలాఫత్ కాలము వరకు బ్రతికి ఉన్నారు.

ఇప్పుడు నేను గౌ॥ రానా నయీమొద్దీన్ తండ్రి గౌ॥ ఫిరోజ్‌ద్దీన్ మున్షీ గారిని గూర్చి వివరించెదను. వీరు 9 ఏప్రిల్ 2020 తేదిన మృతి చెందారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజీవూన్.

రానా గారు 1934లో జన్మించారు. వీరికి 86 సంవత్సరాల వయస్సు గలదు. వీరి కుటుంబంలో అహ్మదియ్యత్ వీరి తండ్రి గారైన గౌ॥ ఫిరోద్దీన్ గారు 1906వ సం॥లో ఒక ఉత్తరము ద్వారా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి బైఅత్ చేయడం ద్వారా వచ్చింది.

అల్లాహ్ తాలా వారికి పరలోకంలో కూడ ప్రేమానురాగాలతో సత్కరించు గాకా!, తమ ప్రీయమైన వారి సన్నిధిలో చోటును ప్రసాదించు గాకా!. అల్లాహ్ తాలా వారి పిల్లలకు ఎల్లప్పుడు విధేయతతో వారి తండ్రి గారి అడుగుజాడలో నడుచు భాగ్యమును కల్పించు గాకా!.

ప్రస్తుతం వ్యాపిస్తున్నటు వంటి వ్యాధి.... నుండి అల్లాహ్ తాలా అందరికి సంపూర్ణ స్వస్థతను కల్గించుగాకా!, మనకు కూడ తన ప్రీతికరమైన మార్గములో నడుచు అవకాశాన్ని కల్పించు గాకా!, సరైన విధముగా మనకు ప్రార్థనల హక్కులను, దేవుని దాసుల హక్కులను చెల్లించు భాగ్యమును కల్పించుగాకా!, సాధ్యమైనంత త్వరలో ఈ వ్యాధిని మన నుండి దూరం చేయుగాకా!, ప్రపంచీకులకు కూడ బుద్దిని, జ్ఞానాన్ని ప్రసాదించుగాకా!, వారు కూడ ఏకేశ్వరుడిని గుర్తించుదురు గాకా!, దేవున్ని ఆరాధించుదురు గాకా!, ఏకేశ్వరత్వంను అర్థం చేసుకొందురు గాకా! అల్లాహ్ తాలా అందరిని కరుణించుగాకా!.

**సయ్యద్నా అమీరుల్ ముమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ. 17 ఏప్రిల్ 2020 ( 17 షహాదత్ 1399 హి.ష) తేదీన మస్జిద్ ముబారక్, ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ప్రసంగం.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُولُهُ
أَمَّا بَعْدُ فَأَعُوذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ
اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِيْنَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۔
اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۔
صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ۔

నేడు బద్రి అనుచరులలో హజ్రత్ ముఆజ్ బిన్ హారిస్ రజి గురించి నేను ప్రస్తావింతును. హజ్రత్ ముఆజ్ రజి అన్సార్‌లోని ఖజ్రజ్ తెగకు చెందిన బనూమాలిక్ బిన్ నజ్జార్ వంశస్థులు. హజ్రత్ ముఆజ్ రజి తండ్రి పేరు హారిస్ బిన్ రఫాఅ కాగా, తల్లి పేరు అఫ్రా బిన్తె ఉబైద్ . హజ్రత్ ముఅవ్విజ్ రజి మరియు హజ్రత్ ఔఫ్ రజి వీరి సోదరులు. ఈ ముగ్గురు సోదరులు తమ తండ్రితో పాటు తల్లి పేరున కూడ పిలువబడుతారు. కావున ఈ ముగ్గురిని అఫ్రా కుమారులని కూడ అనేవారు. హజ్రత్ ముఆజ్‌రజి, వారి ఇద్దరు సోదరులు హజ్రత్ ఔఫ్ రజి, హజ్రత్ ముఅవ్విజ్ రజిబదర్ యుద్ధములో పాల్గొన్నారు. హజ్రత్ ఔఫ్ రజి, హజ్రత్ ముఅవ్విజ్ రజి ఇద్దరు బదర్ యుద్ధములో అమరులైనారు. కాని హజ్రత్ ముఆజ్ రజి తర్వాత జరిగిన యుద్ధములన్నింటిలో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి పాల్గొన్నారు. ఒక కథనము ప్రకారము మక్కాలో మొదట హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను విశ్వసించిన వారిలో హజ్రత్ ముఆజ్ బిన్ హారిస్ రజి, హజ్రత్ రాఫి బిన్ మాలిక్ జురఖీ రజి వుండిరి. హజ్రత్ ముఆజ్ రజి బైఅతె అఖ్బా ఊలా సందర్భమున విశ్వసించిన ఏనిమిది మంది అన్సార్‌లో ఒకరు. ఇదే విధంగా బైఅతె అఖ్బా సానియాలో కూడ హజ్రత్ ముఆజ్ రజి పాల్గొన్నారు. హజ్రత్ ముఅమ్మర్ బిన్ హారిస్ రజి మక్కా నుండి ప్రస్థానము చేసి మదీనా వచ్చినప్పుడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారిని హజ్రత్ ముఆజ్ బిన్ హారిస్ రజి నకు సోదరులుగా అనుబంధమును ఏర్పర్చినారు. (ఉసదుల్ ఘాబా, సంపుటి 5, పుట 190-191, హజ్రత్ ముఆజ్ బిన్ అల్ హారిస్ బిన్ రిఫాఅ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ లిబ్నాన్ 2003) ( అత్తబ్ఖాతుల్ కుబ్రా లి ఇబ్నే సఅద్ సంపుటి 3, పుట 374 హజ్రత్ ముఆజ్ బిన్ అల్ హారిస్ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ లిబ్నాన్ 1990).

అబూ జహల్ హత్య ఉదంతం ఇంతకు ముందు గత సం॥లోని ఒక జుమా ప్రసంగంలో కూడ ప్రస్తావించబడెను. (జుమా ప్రసంగం ఏప్రిల్ 5, 2019, ఆధారము: అల్ ఫజల్ ఇంటర్నేష్నల్ 26 ఏప్రిల్ 2019) కాని ఇక్కడ కూడ కొంత ప్రస్తావించుట తప్పనిసరి. ఎందుకనగా హజ్రత్ ముఆజ్‌కు రజి కూడ ఈ సంఘటనతో సంబంధమున్నది. నేను తెల్పుచున్న కథనములు బుఖారికి చెందినవి. వాటి సారాంశము తెలుపట కష్టతరమైనందున కథనము పూర్తిగా చదివి వినిపించెదను.

మా తాత హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ నాకు ఇట్లు తెలిపినారని సాలిహ్ బిన్ ఇబ్రాహీమ్ ఉల్లే ఖించారు. బదర్ యుద్ధములో నేను వరుసలో నిలబడి ఉన్నాను. నేను నా కుడి, ఎడమ చూడగా పిన్న వయస్కులైన ఇద్దరు అన్సార్ బాలులు కనిపించారు. వీరి కంటే ఎక్కువ వయస్కులు, బలవంతులు వున్నచో బాగుండునని నేను భావించితిని. ఇంతలోనే వారిలో ఒకడు నా చెయ్యి ఒత్తుతూ చిన్నాన! మీరు అబూజహల్‌ను గుర్తు పట్టగలరా? అని అడిగెను. అందుకు నేను ఓ నా సోదరుడి కుమారుడా! అతనితో నీకేం పని? అని నేను ప్రశ్నించితిని. అప్పుడు ఆ బాలుడు “ అతడు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను దూషించేవాడని నేను విన్నాను. ఎవరి హస్తములో నా ప్రాణమున్నదో అతని ప్రమాణముగా! నేను అతణ్ణి చూచినచో మాలో ఎవరి

మరణము మొదట నిర్ణయించియున్నదో అతడు మరణించనంత వరకు నా చూపు అతనిపైనే యుండును” అని సమాధానమిచ్చెను. అప్పుడు అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ రజి అతని సమాధానము నన్ను ఆశ్చర్యమునకు గురిచేసిందని తెలిపారు. మరల రెండవ బాలుడు నా చెయ్యిని ఒత్తుతూ ఇదే ప్రశ్న అడిగెను. రెండవ వైపు నిలబడిన నవ యువకుడు కూడ నన్ను అదే ప్రశ్నను అడిగెను. కొద్ది సమయంలోనే అబూజహల్ ప్రజల మధ్యలో తిరుగుచుండగా నేను చూశాను. అప్పుడు నేను ఆ బాలలతో మీరు ఎవరిని గూర్చి నన్ను అడిగి తెలుసుకోవాలనుకున్నారో ఆ వ్యక్తి, మీ మిత్రుడు ఇతడేనని నేను వారికి అతనిని చూపించితిని. అతని గురించి వినగానే వారిద్దరు తమ ఖడ్గములు తీసుకొని అతని వైపు పరుగెత్తి, అతనిపై ఒక్కసారిగా దాఢి చేసి అతనిని హతమార్చినారు. అనంతరం వారు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు చేరుకొని వారికి ఈ వార్తనందించారు. మీలో ఎవరు అతణ్ణి హతమార్చినారని హుజూర్ (స) అడుగగా నేనే చంపితినని ఇద్దరు సమాధానమిచ్చిరి. మీరు మీ ఖడ్గములను శుభ్రముగా తుడ్చుకున్నారా? అని మరల హుజూర్ (స) గారు అడిగిరి. అందుకు లేదని వారు బదులిచ్చిరి. హుజూర్ (స) వారి ఖడ్గములను చూచి, మీరిద్దరు అతణ్ణి హతమార్చినారని తెలిపిరి. అనంతరం ఇట్లనిరి. అతని ధనము ముఆజ్ బిన్ అమ్రూ బిన్ జమూహ్‌కు లభించును. వారిద్దరి పేర్లు కూడ ముఆజ్‌యే. అనగా ముఆజ్ బిన్ అఫ్రా, ముఆజ్ బిన్ అమ్రూ బిన్ జమూహ్. ఇది సహీ బుఖారి కథనము. (సహి బుఖారి, కితాబుల్ ఫర్జుల్ ఖమ్సుల్ అస్లాబ్ ...... హదీస్ 3141).తత

హజ్రత్ అనస్ రజి ఇట్లు ఉల్లేఖించిరి. అబూజహల్ ఏ పరిస్థితిలో ఉన్నాడో ఎవరు తెలుసుకొని వచ్చెదరు? అని బదర్ యుద్ధము రోజున ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రశ్నించిరి. అందుకు హజ్రత్ ఇబ్నె మస్‌వూద్ రజి మృతుల మధ్యకు వెళ్లి చూడగా అతడు కొన ఊపిరితో కొట్టుమిట్టాడు స్థితికి చేరునట్లుగా అఫ్రా ఇద్దరు కుమారులు హజ్రత్ ముఆజ్ రజి, హజ్రత్ ముఅవ్విజ్ రజిలు తమ ఖడ్గాలతో అతణిపై దాఢి చేసారు. హజ్రత్ ఇబ్నె మస్‌వూద్ రజి అతన్ని చూసి అబూజహల్ నువ్వేనా? అని అడిగెను. మరల హజ్రత్ ఇబ్నె మస్‌వూద్ రజి ఇట్లు తెలిపిరి. నేను అతని గడ్డము పట్టుకోగా, మీరు హతమార్చిన వ్యక్తి కంటే మరొక గొప్ప వ్యక్తి ఉన్నడా? లేదా తన జాతి వారిచే హతమార్చబడిన వ్యక్తి కంటే గొప్ప వ్యక్తి మరెవరైనా ఉన్నారా? అని అబూజహల్ ప్రశ్నించెను. అహ్మద్ బిన్ యూనుస్ తమ కథనములో ఇట్లు తెలిపిరి. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ రజి నివ్వే అబూజహల్‌వా? అనే పదాలను పలికినారు. ఇది కూడ బుఖారి హదీసే. (సహి బుఖారి కితాబుల్ మఘాజి బాబ్ ఖతలు అబి జహల్ హదీస్ 3962)

హజ్రత్ సయ్యద్ జైనులాబిదీన్ వలి అల్లాహ్ షా గారు బుఖారిలో ఉన్నటు వంటి కథనమును విశ్లేషిస్తూ ఈ విధముగా పేర్కొన్నారు.

కొన్ని కథనాలలో ఈ విధముగా గలదు. అఫ్రా ఇద్దరు కుమారులు ముఅవ్విజ్ రజి మరియు ముఆజ్ రజిలు అబూ జహల్‌ను కొన ఊపిరిలో కొట్టు మిట్టాడునట్లు చేశారు. ఆ తరువాత హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ రజి అతని తలను మొండం నుండి వేరు చేసినాడు. ఈ కథనము బుఖారి గ్రంథములోని కితాబుల్ ముఘాజిలో గలదు. అల్లామా ఇబ్నే హజర్ ఉస్కలాని గారు ఈ విషయాన్ని ప్రస్తావించుతూ ముఆజ్ బిన్ అమ్రూ రజిమరియు ముఆజ్ బిన్ అఫ్రా రజి తరువాత ముఅవ్విజ్ బిన్ అఫ్రా రజి కూడ అతనిపై దాఢి చేసిఉండవచ్చునని ఆశాభావాన్ని కనబర్చారు. (సహి బుఖారి, కితాబుల్ ఫర్జుల్ ఖమ్సు, సంపుటి 5, పుట 491 అనుబంధం. ఉర్దూ అనువాదంను ప్రచురించిన వారు నజారత్ ఇషాఅత్ రబ్వా).

బదర్ యుద్ధములో అబూజహల్‌ను ఎవరెవరు హతమార్చారు. అనే విషయంలో ఒక చోట ఇలా స్పష్టమైన వివరణ లభించును.

ఇబ్నె హష్షామ్ గారు అల్లామా ఇబ్నె ఇస్‌హాఖ్ పేరున ఇట్లు ఉల్లేఖించారు. ముఆజ్ బిన్ అమర్ బిన్ జమూహ్ రజి అబూజహల్ కాలును నరికి వేసెను. ఫలితముగా అతడు క్రింద పడిపోయెను. అది చూసిన అక్రమా బిన్ అబూజహల్ హజ్రత్ ముఆజ్ రజి చెయ్యిపై దాడి చేయగా వారి చెయ్యి తెగిపోయెను. లేదా భుజము తెగి పడిపోయి ఉండవచ్చును. అనంతరం ముఅవ్విజ్ బిన్ అఫ్రా రజి అబూజహల్‌పై దాడి చేసెను. ఫలితముగా అతడు పూర్తిగా నేలపై పడిపోయెను. కాని అతడు ఇంకా కొన ఊపిరితోనే వుండెను. అందుకని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ రజి అతని తలను నరికి మొండం నుండి వేసెను. మృతులలో అబూజహల్ ఏ పరిస్థితులో ఉన్నాడో చూసిరమ్మని మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశించిన తరువాత, అనగా మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మృతులలో అబూజహల్ ఏ స్థితిలో ఉన్నాడో చూసి రమ్మని ఆదేశించిన సమయంలో హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ రజి అతని తలను నరికి వేసెను. సహీ ముస్లిం హదీసు ప్రకారము, అఫ్రా ఇద్దరు కుమారులు అబూజహల్‌పై దాడి చేయగా అతడు మృతి చెందెను. బుఖారిలో అబూజహల్ హత్య అనే అధ్యాయములో కూడ ఇదే విధముగా వున్నది. ఇమామ్ ఖుర్తుబి దృష్టిలో అఫ్రా ఇద్దరు కుమారులు అబూజహల్‌ను హత మార్చినారనేది ఒక అపోహ మాత్రమే. ముఆజ్ బిన్ అమర్ బిన్ జమూహ్ రజి విషయంలో కొందరు కథకులు పొరపాటు బడ్డారు. అనగా ముఆజ్ బిన్ అఫ్రా రజి బదులు ముఆజ్ బిన్ అమ్రూ బిన్ జమూహ్ రజి వుండిరి. కాని ప్రజలు ముఆజ్ బిన్ అఫ్రా రజి అని భావించుకొన్నారు. మరల వారిట్లనిరి: ముఆజ్ బిన్ అమ్రూ బిన్ జమూహు రజి, ముఆజ్ బిన్ అఫ్రా రజి తో సందిగ్ధంలో పడ్డారు. అల్లామా ఇబ్నుల్ జూజి ఇట్లు తెలిపిరి. ముఆజ్ బిన్ జమూహ్ రజి అఫ్రా సంతానానికి చెందిన వాడు కాదు. ముఆజ్ బిన్ అఫ్రా రజి అబూజహల్‌ను హతమార్చిన వారిలో పాల్గొనెను. బహుశాః ముఆజ్ బిన్ అఫ్రా రజి సోదరుడు లేదా చిన్నాన అప్పుడక్కడ వుండవచ్చును. లేదా కథనములో అఫ్రా ఒక కుమారుని ప్రస్తావన వుండవచ్చును. కాని కథకుడు పొరపాటున ఇద్దరు కుమారుని ప్రస్తావించి ఉండవచ్చును. అబూ ఉమర్ ఇట్లు తెలిపిరి. ఈ హదీసు కంటే హజ్రత్ అనస్ బిన్ మాలిక్ రజి పేర్కొన్న హదీసు ఎక్కువ సరియైనదిగా తెలుస్తున్నది. అందులో అఫ్రా కుమారుడు హతమార్చెనని గలదు. అనగా అఫ్రా ఒక కుమారుడు. ఇబ్నె తైమ్ ఇట్లనిరి. ముఆజ్ బిన్ అమర్ బిన్ జమూహ్ రజి మరియు ముఆజ్ బిన్ అఫ్రా రజి ఇద్దరు తల్లి తరపున సోదరులు కావచ్చును లేదా ఇద్దరు ఒకే తల్లి పాలు త్రాగిన సోదరులై ఉండవచ్చును. అల్లామా దావూదీ గారు అఫ్రా ఇద్దరు కుమారులు అనగా సహల్ మరియు సుహైల్ అని పేర్కొనిరి. అనగా వారిద్దరే ముఅవ్విజ్ మరియు ముఆజ్. (ఉమ్దతుల్ ఖారి, సంపుటి 15, పుట 100-101 ప్రచురణ దారుల్ ఫికర్ బెహ్‌రూత్)

ఏది ఏమైనప్పటికి ముగ్గురు హతమార్చినారనే కథనములు గలవు. కొన్నిటిలో ఇద్దరని గలదు. వాటిలో ముఆజ్ బిన్ హారిస్ పేరు కూడ ప్రస్తావించ బడుతుంది. రాకుమారులు హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ గారు కూడ బదర్ యుద్ధ సంఘటనలను వ్రాశారు. అందులో అబూజహల్ హత్య ఉదంతంను ఈ విధంగా ప్రస్తావించారు.

“రణరంగములో ఘోరమైన రక్తపాతము కొనసాగుచుండెను.





ముస్లిములకు ఎదురుగా వారి కంటే మూడు రెట్లు ఎక్కువ సంఖ్యలో శత్రు సైన్యముండెను. ఇస్లాంను నామరూపాల్లేకుండా తుడిచి వేయాలనే సంకల్పముతో అన్ని రకాల యుద్ధ సామాగ్రిని ధరించి వచ్చెను. నిస్సహాయులైన ముస్లిములు కొద్ది సంఖ్యలో ఉన్నారు. అయుధముల కొరత. బీదరికము, ప్రస్థాన ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న వీరు బాహ్య రూపంలో చూచినచో మక్కా సైన్యం ముందు కొన్ని క్షణాలు కూడ నిలబడలేని స్థితిలో వున్నారు. కాని దైవ ఏకత్వము, ప్రవక్త ప్రేమ వారిని వీరులుగా తీర్చి దిద్దెను. ప్రపంచములో అన్నిటికంటే శక్తివంతమైన విశ్వాసము వారిలో అసాధారణ శక్తిని పూరించెను. రణరంగములో వారు సాటిలేని ధార్మిక సేవ ఉదాహరణను చూపుతున్నారు. ప్రతి ఒక్కరు మరొకరి కంటే ఎక్కువగా పోరాడుతుండెను. దైవ మార్గములో ప్రాణాలర్పించుటకు ఉవ్విళ్లూరుతున్నట్లు కనిపిస్తుండెను. హంజ రజి, అలీ రజి, జుబైర్ రజిశత్రువుల వరుసలను అతలాకుతలం చేశారు. అన్సార్ వినమ్రత ఉత్తేజమును గూర్చి అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ రజి ఇట్లు తెలిపిరి. అందరు పోరాడే యుద్ధము మొదలైనప్పుడు నేను నా కుడి, ఎడమ చూడగా అన్సార్‌లోని ఇద్దరు నవయవకులు నా ప్రక్కన నిలబడి వున్నారు. వారిని చూచి నేను కొంత ధైర్యము కోల్పోయాను. ఎందుకనగా ఇటువంటి సమయములో కుడి, ఎడమ వున్న తోటి సైనికులపై యుద్ధము చాలా ఆధార పడి వుంటుంది. ఎవరికి ఎక్కువగా రక్షణ వుండునో అతడే మంచిగా యుద్ధము చేయవచ్చును. నేను ఇదే ఆలోచనలో వుండగా ఆ యువకులలోని ఒకడు తన మాటను తన రెండవ వైపు వున్న తోటి యువకునికి తెలియకూడదనే రీతిలో చిన్నగా నన్ను ఇట్లడిగెను." ఇతడు బహుశా రెండవ వైపు ఉన్నటు వంటి వ్యక్తికి వినపడకూడదని భావించెను. " ఓ చిన్నానా! హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను మక్కాలో దూషించే అబూజహల్ ఎక్కడున్నాడు? నేను అతణ్ణి హత్య చేస్తానని లేదా అతణ్ణి హత్య చేయు ప్రయత్నములో మృతి చెందుతానని అల్లాహ్ తఆలాతో ప్రతిజ్ఞ చేశాను. నేను ఇంకా అతనికి సమాధానమే ఇవ్వలేదు. అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ రజి ఇంకా ఇట్లనిరి. నేనింకా అతనికి సమాధానము ఇవ్వక ముందే రెండవ వైపున్న యువకుడు కూడ ఇదే రకమైన ప్రశ్నను చిన్నగా అడిగెను. వారి ఈ సాహసమును చూసి నేను అశ్చర్యానికి గురైనాను. ఎందుకనగా అబూజహల్ సైన్యాధికారిగా వ్యవహరిస్తున్నాడు. అతని చుట్టు అనుభవజ్ఞులైన సైనికులున్నారు. చెయ్యితో సంజ్ఞ చేస్తూ అతడే అబూజహల్ అని నేను వారికి చెప్పితిని. నేను అలా చూపగానే ఆ ఇద్దరు బాలులు డేగ (ఒక రకమైన గ్రద్ద) వలె ఎగిరి శత్రువుల వరుసలను చీల్చుతూ ఒక్క క్షణంలోనే అతని వద్దకు చేరుకొని ఎంతో వేగంగా దాడి చేశారు. అబూజహల్, అతని చుట్టున్న సైనికులు చూస్తూ వుండి పోయిరి. ఇంతలోనే అబూజహల్ పడిపోయెను. అక్రమ బిన్ అబూజహల్ తన తండ్రి దగ్గరనే వున్నాడు. అతడు తన తండ్రిని మాత్రం కాపాడుకోలేక పోయెను. కాని వెనుక నుండి ముఆజ్ రజి పై దాడి చేయగా వారి ఎడమ చెయ్యి తెగి పోయి, వ్రేలాడుతుండెను. ముఆజ్ రజి అక్రమాను వెంబడించెను. కాని అతడు తప్పించుకొని పారిపోయెను. తెగిపోయిన చెయ్యితో పోరాడటం కష్టముగా వున్నందున ముఆజ్ దానిని గట్టిగా లాగి తమ శరీరము నుండి వేరు చేసెను. ఆ తరువాత మరల యుద్ధము చేయడంలో నిమగ్నమైపోయెను. ( సీరత్ ఖాతమున్నబీయ్యీన్, హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ ఎం.ఏ పుట 362)

హజ్రత్ ఖలీఫతుల్ మసీహిస్సాని రజియల్లాహు తఆలా అన్హు ఈ సంఘటనను తెలుపుచు ఇట్లనిరి.

"అబూజహల్ పుట్టినప్పుడు కొన్ని వారముల వరకు ఒంటెలను కోసి, వాటి మాంసమును ప్రజలలో పంచిపెట్టడం జరిగింది. " అతను జన్మించినప్పుడు డప్పుల చప్పుడుతో మక్కా మొత్తం మార్మోగెను. పెద్ద పెద్ద డప్పులు వాయించబడెను. పెద్ద ఎత్తున బాజాబజంత్రీలు ఊదబడెను. డప్పులు కొట్టబడెను. అతడు జన్మించినందున అతని కుటుంబీకులు అమితంగా ఆనందించారు. ఫలితముగా మక్కా మొత్తం మార్మోగెను. అనంతరం ఇట్లు వ్రాసిరి. " బదర్ యుద్ధములో హతమైనప్పుడు కేవలం 15 సం॥ల వయస్సులైన ఇద్దరు అన్సార్ యువకులు అతణ్ణి గాయపర్చారు. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ రజి ఇట్లు ఉల్లేఖించిరి. బదర్ యుద్ధము తర్వాత ప్రజలు తిరిగి పోవుచున్నప్పుడు మైదానములో పడి ఉన్న క్షతగాత్రులను చూచుటకు నేను వెళ్లితిని. వారు రజి కూడ మక్కా నివాసులైనందున వారు అబూజహల్ నకు బాగా తెలిసే వుండిరి. వారిట్లు తెలిపిరి. నేను రణరంగములో తిరుగుతుండగా అబూజహల్‌ను గాయాలతో బాధపడుతుండగా చూచితిని. నేను అతని వద్దకు చేరుకోగా అతడు నన్నుద్దేశించి ఇట్లనెను. ఇక నేను బ్రతకడం కష్టమే అనిపిస్తుంది. బాధ తీవ్రమైనది. నువ్వు కూడ మక్కా వాడివే. నువ్వు నన్ను చంపి వేయాలని నేను కోరుతున్నాను. తద్వారా నా బాధ దూరమగును. నేను అరబ్బుల నాయకుడిని అనే విషయము నీకు తెలుసు. నాయకుల తల పొడుగాటి మెడతో నరికి వేయబడు ఆచారము అరబ్‌లో వున్నది. ఇది మృతుని నాయకత్వమునకు గుర్తుగా వుండును. కావున నువ్వు నా మెడను పొడుగ్గా నరికి వేయాలని నేను ఆశిస్తున్నాను అని విన్నవించుకొనెను. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ రజి ఇట్లు తెలిపిరి. నేను అతని తల భాగం వరకే మొద నుండి వేరుచేసితిని." తల క్రింది భాగం వరకే కోసివేసితిని. " నీ ఈ చివరి కోరిక కూడ పూర్తి చేయబడదని నేనతనికి చెప్పితిని. అంతమును చూచినచో అబూజహల్ అంతము ఎంత దుర్భరమైనదో చూడండి. అతని తల జీవితములో ఎల్లప్పుడు పైకి లేచి వుండెడిది. కాని అతడు మరణించేటప్పుడు అతని తల మొద పై భాగం వరకే నరికి వేయబడెను. ఇలా అతని ఈ చివరి కోరిక కూడ తీర్చబడలేదు. (తఫ్సీరే కబీర్, సంపుటి 7, పుట 101)

హజ్రత్ రుబై బిన్ ముఅవ్విజ్ రజి ఇట్లు ఉల్లేఖించిరి. నా చిన్నాన హజ్రత్ ముఆజ్ బిన్ అఫ్రా రజి నాకు కొన్ని తాజా ఖర్జూరములిచ్చి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు పంపిరి. అప్పుడు బహ్రైన్ పాలకుడు నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు బహుకరించిన ఒక ఆభరణము వారు నాకిచ్చిరి. మరో కథనములో ఇట్లు గలదు. హజ్రత్ రుబై బిన్ ముఅవ్విజ్ ఇట్లు ఉల్లేఖించిరి. నా చిన్నాన హజ్రత్ ముఆజ్ నా ద్వారా ఒక కానుక నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు పంపిరి. అప్పుడు బహ్రైన్ పాలకుడు బహుకరించిన ఒక ఆభరణమును నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం నాకు ఇచ్చిరి. మరొక కథనములో ఈ విధముగా గలదు. హజ్రత్ రుబై బిన్త్ ముఅవ్విజ్ రజి ఇలా మరల ఉల్లేఖించారు. మా పిన్నాన్నా హజ్రత్ ముఆజ్ రజి ఒక బహుమానమును నా చేతుల మీదుగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంనకు పంపినారు. అందుకు హుజూర్ (స) బహ్రైన్ పాలకుడు బహుకరించిన ఒక ఆభరణమును ఇచ్చినారు. అల్లామా ఇబ్నె అసీర్ ఇట్లు వ్రాసిరి. ఇస్లాం విస్తరించిన తర్వాత హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం రాజుల పేరిట ఉత్తరములు వ్రాసి కానుకలతో పాటు పంపినప్పుడు బహ్రైన్ పాలకుడు, ఇతర రాజులు హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు తిరిగి కొన్ని కానుకలు పంపిరి. రాజులు కూడ హుజూర్‌కు ఉత్తరములు వ్రాసి, తమ తరపున కానుకలు పంపినారు. ( ఉసదుల్ ఘాబా, సంపుటి 5,

R. Subbarao
MARKETING HEAD
GENESIS AQUA NATURELS
89855 87875, 99494 12352
genesisaquanaturels@gmail.com
#C Block, Flat No. 414,
Madhinagauda,
Hyderabad,
Telangana - 500 050.

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దుఆ ఆశించువారు: SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)

పుట 192, హజ్రత్ ముఆజ్ బిన్ అల్ హారిస్ బిన్ రిఫాఅత్ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహారూత్ లిబ్నాన్ 2003).

హజ్రత్ ముఆజ్ బిన్ హారిస్ రజి నాలుగు వివాహములు చేసుకొనిరి. వాటి వివరములు ఇట్లు గలవు. హబీబా బిన్తె ఖైస్‌తో వీరికి ఒక కుమారుడు ఉబైదుల్లాహ్ జన్మించెను. వీరి రెండవ వివాహము ఉమ్మె హారిస్ బిన్ సబ్రహ్‌తో జరిగెను. ఈ భార్యతో హారిస్, ఔఫ్, సల్మా, ఉమ్మె అబ్దుల్లాహ్, రమ్లు జన్మించిరి. ఉమ్మె అబ్దుల్లాహ్ బిన్తె నుమైర్ వారి మూడవ భార్య. వీరితో ఇబ్రాహీమ్, ఆయిషా జన్మించిరి. ఉమ్మె సాబిత్ రమ్లు బిన్తె హారిస్ వీరి నాలుగవ భార్య. వీరితో సారహ్ జన్మించెను. (అత్తబ్ఖాతుల్ కుబ్రా సంపుటి 3, పుట 373-374, హజ్రత్ ముఆజ్ బిన్ అల్ హారిస్ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహారూత్ లిబ్నాన్ 1990).

అల్లామా ఇబ్నె అసీర్ తమ పుస్తకము ఉసదుల్ ఘాబహ్‌లో హజ్రత్ ముఆజ్ రజి మృతి గురించి విభిన్న అభిప్రాయములు పొందుపర్చిరి. ఒకరి అభిప్రాయము మేరకు హజ్రత్ ముఆజ్ రజియల్లాహు అన్హు బదర్ యుద్ధములో గాయ పడిరి. వారు మదీనాకు తిరిగి వచ్చిన తరువాత ఆ గాయాల వలనే మృతి చెందారు. మరొక వ్యాఖ్యానము ప్రకారము వారు హజ్రత్ ఉస్మాన్ ఖిలాఫత్ హయాం వరకు బ్రతికే ఉన్నారు. మరొక కథనము మేరకు వారు హజ్రత్ అలీ ఖిలాఫత్ కాలము వరకు బ్రతికి ఉన్నారు. హజ్రత్ అలీ మరియు హజ్రత్ అమీర్ ముఆవియహ్ మధ్య సంభవించిన సిఫ్ఫీన్ యుద్ధములో వారు మృతి చెందిరి. సిఫ్ఫీన్ యుద్ధము 36-37 హిజ్రీ సంవత్సరములో జరిగినది. హజ్రత్ అలీ తరపున హజ్రత్ ముఆజ్ రజి యుద్ధములో పాల్గొన్నారు. (ఉసదుల్ ఘాబా సంపుటి 6, పుట 191, హజ్రత్ ముఆజ్ బిన్ అల్ హారిస్ బిన్ రిఫాఅ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహారూత్ లిబ్నాన్ 2003) ( అల్ ఇస్తియాబూ ఫి మఅరుఫతు స్సహాబ, సంపుటి 3, పుట 1409-1410, హజ్రత్ ముఆజ్ బిన్ అఫ్రా దారుల్ జీల్ బెహారూత్).

ఇలా వీరి మరణము గురించి భిన్న కథనాలు గలవు. కొన్ని విషయములను పరిశీలించినచో తెలియునదేమనగా, అనగా ఒకవేళ వీరే అయినచో వీరి భార్యలు, సంతానమును చూచినచో వీరు సుదీర్ఘ ఆయువు పొందారని తెలుస్తున్నది.

ఈ అనుచరుని ప్రస్తావన తరువాత ఇప్పుడు నేను గౌ॥ రానా నయీమొద్దీన్ తండ్రి గౌ॥ ఫిరోజ్దీన్ మున్షీ గారిని గూర్చి వివరించెదను. వీరు 9 ఏప్రిల్ 2020 తేదిన మృతి చెందారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజీవూన్. వీరు చాలా కాలం నుండి అనారోగ్యముగా ఉన్నారు. వివిధ అనారోగ్య కారణాల వలన ఎన్నో సార్లు వీరు ఆసుపత్రిలో చేర్చబడేవారు. డాక్టర్లు కూడ వీరికి ఇవే చివరి క్షణాలు అని తెలిపేవారు. కాని అల్లాహ్ తాలా అనుగ్రహం వలన స్వస్థత పొంది తిరిగి ఇంటికి వచ్చేవారు. నడిచే సామర్థ్యం కూడ వారికి లభించేది. అందుకే ఇక్కడి మస్జిద్‌కు కూడ వచ్చేవారు. కాని ఈ చివరి అనారోగ్యం మాత్రం వీరి ప్రాణాల మీదికి వచ్చింది. ఫలితముగా వీరు మృతి చెందారు.

రానా గారు ధృవపత్రాల అనుసారం 1934లో జన్మించారు. కాని మరి కొన్ని ఆధారాల ప్రకారం వీరు బహుశా 1930 లేదా 32లో జన్మించినట్లు గలదు. మొత్తానికి ధృవపత్రాల ఆధారముగా చూసినచో అనగా 1934వ సంవత్సరం నుండి చూసినచో వీరికి 86 సంవత్సరాల వయస్సు గలదు. వీరి కుటుంబంలో అహ్మదియ్యత్ వీరి తండ్రి గారైన గౌ॥ ఫిరోద్దీన్ గారి ద్వారా వచ్చింది. వీరి తండ్రి గారు 1906వ సం॥లో ఒక ఉత్తరము ద్వారా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి బైఅత్ చేశారు. దేశ విభజన తరువాత అనగా భారతదేశం మరియు పాకిస్తాన్‌లు ఏర్పడ్డాకా వీరు పాకిస్తాన్‌కు వలస వెళ్ళి ముందుగా లాహోర్‌లో నివాసం ఏర్పర్చుకున్నారు. ఆ తరువాత 1948లో రానా గారు రబ్వాకు మకాం మార్చారు. ఆ తరువాత వారు తమను తాము స్వయముగా ఫుర్ఖాన్ బటాలియన్‌కు అంకితం చేసుకున్నారు. ఫుర్ఖాన్ బటాలియన్ తరువాత హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని రజియల్లాహ్ అన్హు గారు రానా గారిని మీర్‌పూర్ నగర సమీపంలో ఉన్నటు వంటి జమాఅత్ భూముల పర్యవేక్షణకై నియమించారు. అక్కడ కొన్ని సంవత్సరాలు జీవనం కొనసాగించారు. వసియ్యత్ వ్యవస్థలో వీరు చాలా కాలం క్రితమే పాల్గొన్నారు. అనగా 1951లోనే వీరు వసియ్యత్ చేశారు. వీరి వివాహం కూడ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి అనుచరులైన దౌలత్ ఖాన్ గారి మనుమరాలు సారా పర్వీన్ గారితో జరిగింది. కార్యాలయ రికార్డుల ప్రకారం, అనగా అంగ రక్షక సేవకుల కార్యాలయ రిజిస్టర్ ప్రకారం రానా నయీమొద్దీన్ గారు ఆగష్టు 3, 1954వ సం॥లో రిజర్వు ఆన్ డ్యూటిలో నియమితులైనట్లుగా వీరిని గూర్చి పొందు పర్చడం జరిగింది. ఆ తరువాత నవంబర్ 1955 నుండి 11 మే 1959 వరకు అంగ రక్షకులకు సలహాదారులుగా కొనసాగారు. హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని రజియల్లాహు అన్హు తఫ్సీర్ వ్రాసే క్రమంలో జాబె నఖ్ల ప్రాంతానికి వెళ్ళి, అక్కడ నెలల కొద్ది బస చేసేవారు. ఆ సమయంలో రానా గారికి రక్షణ సేవకుడిగా మరియు అక్కడ విద్యుత్ లేనందున జనరేటర్ నిర్వాహకుడిగా, జనరేటర్‌కు డిజిల్ అందించునట్టి బాధ్యతలను నిర్వర్తించారు. సాధారణముగా అక్కడి ప్రాంతంలో ఒక చిన్న జనజీవన నగరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. కావున ఆయా కుటుంబాల రక్షణ బాధ్యతలను కూడ వీరికే అప్పగించారు.

వసియ్యత్ కార్యాలయ రికార్డు ప్రకారం వీరు 1978వ సం॥లో అంగ రక్షణ సేవ నుండి వైదొలిగారు. ఆ తరువాత అక్కడి నుండి హడ్సా జిల్లాలోని సాహేవాల్‌కు వెళ్ళిపోయారు. సాహేవాల్ మస్జిద్‌లో మస్జిద్ సేవకుడిగా సేవలందించడం ప్రారంభించారు. ఆ మధ్య కాలంలోనే అనగా అక్టోబర్ 1984వ సం॥ సాహేబాల్‌లోని అహ్మదియ్య మస్జిద్ బైతుజ్జికర్ పై వ్యతిరేకులు దాడి చేశారు. వీరు గతంలో రక్షణ సేవకుడిగా డ్యూటి చేసినందున ఆ దాడి సమయంలో వీరు ఎంతో ధైర్యాన్ని ప్రదర్శిస్తూ వ్యతిరేకులకు సమాధాన మిచ్చారు. అందు వలన రానా నయీమొద్దీన్ గారితో పాటు 11 మంది పై వ్యాజ్యమును మోపారు. ఆ విధముగా రానా గారికి 26 అక్టోబర్ 1984 నుండి మార్చి 1994 వరకు దైవ మార్గపు ఖైదిగా జైలులో జీవించు భాగ్యం లభించినది.

పోలీస్‌లు దాడి చేసిన వారిపై వ్యాజ్యము మోపుటకు బదులు, మన జమాఅత్‌కు చెందిన 11 మందిపై వ్యాజ్యమును మోపుతూ, వారికి శిక్షను విధించారు. ఈ వ్యాజ్యమును మిలటరి కోర్టుకు అప్పగించడం జరిగింది. జియాఉల్ హఖ్ కాలంలో ఇలాంటి ప్రత్యేక కోర్టులు ఉండేవి. ఆ కోర్టులో ఫిబ్రవరి 16, 1985 నుండి జూన్ 1, 1985 వరకు ఈ వ్యాజ్యపూర్వ పరాలపై వాదనలు కొనసాగాయి. ఈ వ్యాజ్యములో మొత్తం 11 మంది ఉండగా, వారిలో రానా గారితో కలిపి ఏడుగురి విచారణను పెండింగ్‌లో పెట్టారు, ఆపై ఇద్దరిని నిరపరాదులుగా వదిలివేశారు, మరో ఇద్దరు ఇతర దేశాలకు వెళ్ళిపోయారు. తరువాత కాలంలో ఆ మిలటరి కోర్టులోనే పెండింగ్‌లో ఉన్నటు వంటి ఈ ఏడుగురి వ్యాజ్యమును విచారించి, ఇల్యాస్ మునీర్ మురబ్బి సిల్‌సిలా మరియు రానా నయీమొద్దీన్ గార్లకు మరణశిక్షను ఖరారు చేస్తున్నట్లు,

ప్రొ॥ ముహమ్మద్ సలీమ్
9949356387
9949146660
Love for All Hatred for None
మస్రూర్ హోటల్
టీ, టిఫిన్, మీల్స్, చికెన్ బిర్యాని, ఫాస్టు ఫుడ్ లభించును.
నాయుడు పెట్రోల్ పంపు, ఖమ్మం రోడ్, వరంగల్, తెలంగాణ
అన్ని కంపెనీల సెల్ రిచార్జ్‌లు చేయబడును.

**ఇమామ్ వాఖ్యములు**

మీకు ఇహలోక పరలోక సాఫల్యము కలగాలని, ప్రజల హృదయాలను జయించాలని మీరు ఆశించుచున్నచో పవిత్రతను ఆచరించుము. తమను తాము చక్కదిద్దుకొని ఇతరులకు ఆదర్శముగా నిలువగలరు. అప్పుడు మీరు సఫలమగుదురు." (ఖుత్బా జుమా 1 జనవరి 2016)

దుఆ ఆశించువారు: *Darga sb, jamat AhmadiyyaVizag (A.P)*

మిగిలిన 5గురు సభ్యులకు 25, 25 సంవత్సరాల జైలుశిక్షను విధిస్తున్నట్లు తీర్పునివ్వడం జరిగింది. మొత్తానికి ఆ తీర్పును ప్రశ్నిస్తూ లాహోర్ హైకోర్టులో అపీల్ చేయగా హైకోర్టు వీరిని మార్చి 1994లో విడుదల చేస్తున్నట్లు తీర్పునిచ్చింది. పత్రాల పరిశీలన తరువాత 19 మార్చి 1994లో వీరిని విడుదల చేశారు. ఇలా రానా గారు 9 సంవత్సరాల 6 నెలల పాటు దైవ మార్గపు ఖైధిగా జైలులో శిక్షను అనుభవించు భాగ్యమును పొందారు. దైవ మార్గపు ఖైది అదృష్టంను పొందారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రశ్నిస్తూ వ్యతిరేకులు సుప్రీంకోర్టులో అపీల్ దాఖాలు చేయగా, ఆ వ్యాజ్యము కూడ మే 2013 నుండి విచారణకు వచ్చింది. కాని వీరు ఇరువురు బయటి దేశాలలో ఉన్నందున ఈ వ్యాజ్యము ముందుకు కొనసాగలేదు. పైగా నేటి వరకు అది పెండింగ్‌లోనే ఉన్నది.

ఖైదిగా ఉన్న సమయంలో పోలీస్‌లు వారిపై ఉద్దేశపూర్వకముగానే చాలా దౌర్జన్యముగా వ్యవహరించారు. ఆ క్రమంలోనే నీవు మీ ఖలీఫాకు సెక్యూరిటీగా ఉన్నందున వారే ఇలా ముసల్మానులను చంపమని పంపించినారని బలవంతముగా వాగ్మూలము చెప్పించుటకు చాలా ప్రయత్నించారు. కాని వారి ప్రయత్నాలు ఫలించలేదు. రానా నయీమొద్దీన్ గారు జైలు నుండి విడుదల కాగానే 1994లో లండన్‌కు వలస వచ్చారు. ఇక్కడ కూడ వారు తమ వయస్సు రీత్యా సెక్యూరిటి డ్యూటిని ఎంతో గొప్పగా నిర్వర్తించారు. 2010లో వీరి పెద్ద కుమార్తె మృతి చెందినది. ఆ తరువాత కొంత కాలానికి వీరి శ్రీమతి మృతి చెందినది. ఆ తరువాత పాకిస్తాన్‌కు వెళ్ళి వచ్చేదనని వారు నన్ను అనుమతిని కోరగా, పరిస్థితులు అనుకూలముగా లేనందున త్వరగా తిరిగి రాగలవని అనుమతించాను. కావున వీరు కొన్ని రోజుల కొరకు పాకిస్తాన్‌కు వెళ్ళి మరల తిరిగి వచ్చారు.

వీరు తమ జ్ఞాపకార్థం ఒక కుమారుడిని, నలుగురు కుమార్తెలను వదిలి వెళ్ళారు. వీరి కుమారుడు రానా వసీం అహ్మద్ జీవిత సమర్పితులు. ప్రస్తుతం యు.కేలోని సెక్రటరి కార్యాలయంలో సేవలందిస్తున్నారు. వీరి నలుగురు కుమార్తెలు కూడ లండన్‌లోనే ఉన్నారు. వారి కుమారుడు ఈ విధముగా వ్రాసారు: ఖిలాఫత్‌తో అనుసంధానమై ఉండాలని, ఖిలాఫత్‌తోనే అన్ని రకాల శుభాలు ముడిపడి ఉన్నాయని మా తండ్రి గారు మాకు పదే పదే నేర్పించే వారు. "నేను డ్యూటికి వెళ్ళినప్పుడు ఖలీఫా గారిని చూడగానే యువకుడిలా మారిపోతాను. నా ఆరోగ్య రహస్యము కూడ ఇదియే. అందుకే ఈ వయస్సులో కూడ నేను డ్యూటికి వెళ్తున్నాను. లేనిచో ఎప్పుడో మంచానా పడిపోయేవాడిని." అని తనకు ఖిలాఫత్ పట్ల ఉన్నటు వంటి అభిమానాన్ని వారు కొన్ని సందర్భాలలో మాకు తెలిపేవారు. సమయ పాలనను అనుసరించేవారు. ఎల్లప్పుడు డ్యూటికి 2, 3 గంటలు ముందుగానే సిద్ధముగా ఉండేవారు. అబ్బాజాన్ ఇంకా సమయం ఉన్నది కదా, ఇంత త్వరగా సిద్ధము కావలసిన అవసరమేముందని ప్రశ్నించగా, ఇంట్లో కూర్చొని చేసేది ఏముంది?. అని సమాధానమిచ్చేవారు.

హష్మామ్ అను డాక్టర్ గారు కూడ వీరిని గూర్చి ఈ విధముగా వ్రాసారు: నేను వారి రిపోర్ట్ చూశాను, వారి ఫైల్‌ను చదివి చాలా ఆశ్చర్యపోయాను. ఇంతటి అనారోగ్య స్థితిలో, ఈ వయస్సులో సాధారణముగా ఇతరులైతే ఇంట్లో మంచాన పడిపోతుంటారు. లేదా కేర్ హోమ్‌లో చేర్చబడుతారు. కాని వీరు నడుస్తున్నారు, తిరుగుచున్నారు. అందుకు రానా గారు మాత్రం " వర్తమాన ఖలీఫా గారి సేవలో నిమగ్నమైపోవాలి, వర్తమాన ఖలీఫా గారిని దర్శించు భాగ్యాన్ని పొందాలనే తాపత్రయమే తన ఆరోగ్య రహస్యమని " సమాధాన మిచ్చేవారు. మరల రానా సాహేబ్ అనగా వారి కుమారుడు ఇలా వ్రాసారు: వారికి నేను మాలీష్ చేస్తూండే వాడిని, అలా నేను వారి మోకాళ్ళ వద్దకు రాగానే నెమ్మదిగా బాధ పడేవారు. ఏమైంది? అని ప్రశ్నించగా, ఏమి లేదు అని మాత్రమే సమాధాన మిచ్చేవారు. మొత్తానికి నేను పదే పదే వారిని ఏమైందని ప్రశ్నించగా, ఏమి లేదు. ఇవి జైలులో కొట్టిన దెబ్బల గుర్తులు అని తెలిపేవారు. ఎల్లప్పుడు సహనాన్ని ఓర్పును ప్రదర్శించేవారు. జైలులో అతి దారుణంగా కొట్టినప్పుడు కూడ వీరు చాలా ఓర్పును ప్రదర్శించారు. పాకిస్తాన్ జైలులో దారుణంగా కొడుతుంటారు. విడుదల అయిన తరువాత కూడ వీరు చాలా ఓర్పుతో కూడిన ప్రామాణికమైన జీవితాన్ని జీవించారు. అనారోగ్యానికి గురైనప్పుడు కూడ ఎవరికి చెప్పేవారు కాదు, పైగా అల్ హందులిల్లాహ్ ఆరోగ్యముగానే ఉన్నాను అని సమాధానమిచ్చేవారు.

రానా గారికి ఖిలాఫత్ పట్ల ఉన్న విధేయతను గూర్చి వారి కుమారుడు ఇలా వ్రాసారు: నేను ఒకసారి మా తండ్రి గారి వద్ద కూర్చున్నాను. అట్టి సమయంలో గతంలో జరిగిన సంఘటనలను గూర్చి అడిగి తెలుసుకునే వాడిని. ఆ క్రమంలోనే ఒకరోజు వారు ఇలా తెల్పినారు: హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని రజియల్లాహు అన్‌హు జాబే నఖ్లా ప్రాంతానికి తఫ్సీర్ వ్రాయడం కొరకు వెళ్ళినప్పుడు నేను కూడ వారితో ఉన్నాను. నేను ముందుగా తెల్పినట్లుగా రానా గారు అక్కడే ఉండేవారు. మరల ఇట్లు తెల్పినారు. ఏదో విషయంలో హుజూర్ నన్ను కోపగించారు. రానా నయీమ్‌గారిని కోపగించారు. ఆ కోపంతో నీవు మస్జిద్‌కు వెళ్ళి అస్తఫ్‌ఫార్ చేస్తుండమని హుజూర్ గారు ఆదేశించారు. అంతలోనే భారీ తూఫాన్ ప్రారంభమైంది. వర్షం కురుస్తుంది. అయినా కూడ నేను కూర్చున్న చోటనే కూర్చొని అస్తఘ్‌ఫార్ చేస్తున్నాను. చాలా సమయం గడిచిపోయింది. మస్జిద్‌కు అంటి పెట్టుకొని ఉన్నటు వంటి పందిరి కూడ తూఫాన్‌కు కొట్టుకపోయింది. ఇంతలోనే హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని రజి నయీమొద్దీన్ ఎక్కడ అని అడిగి తెలుసుకున్నారు. కొందరు నన్ను వెతుకుతూ మస్జిద్ వద్దకు వచ్చి హుజూర్ నిన్ను పిలుస్తున్నారు అని తెల్పినారు. వెంటనే నేను హుజూర్ గారి సన్నిధికి చేరుకోగా, హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని సన్నిధికి చేరుకోగా, నీవు ఇక్కడే ఎక్కడో కూర్చొని ఉంటావనే విషయం నాకు తెలుసు, నిన్ను క్షమించాను వెళ్ళిపో అని హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని వారిని ఆదేశించారు. మరల వారి కుమారుడు ఇలా వ్రాసారు: హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని తఫ్సీర్ వ్రాస్తున్న సమయంలో మా తండ్రి గారికి హుజూర్ వద్ద ఉండి వారికి సేవ చేయు భాగ్యము లభించినది. ఈ విషయాన్ని వారు ఎంతో ఆనందముగా, గొప్పగా చెప్పుకునేవారు. తమ ఆనందాన్ని అందరికి పంచడం వారి అలవాటు. కాని బాధను ఎవరికి తెలుపేవారు కాదు.

మరల వారి ప్రత్యేకతలను గూర్చి తెల్పుచూ ఇలా వ్రాసారు: ఎంతో కరుణా స్వభావుడైన తండ్రిగారు వారు , ఒక స్వచ్ఛమైన మిత్రుడిగా ఉండేవారు. రానా వసీమ్ గారు తమ జీవితాన్ని అంకితం చేసినప్పుడు, వారి అంకితం స్వీకరించిన తరువాత ఒక రోజు వారి తండ్రి గారు వసీం గారితో ఇలా అన్నారు. ఇది చాలా పెద్ద బాధ్యత. ఎల్లప్పుడు తౌబహ్, అస్తఘ్‌ఫార్లు చేస్తూ నీ జీవిత సమర్పిత హక్కును పూర్తి చేయుటకు ప్రయత్నించుము. ఎవరైన బాధించినచో మౌనంగా అక్కడి నుండి వెళ్ళిపొమ్ము, ఎవరితో వాగ్వివాదం


| ఇమామ్ వాఖ్యములు | "ముస్లిములు పవిత్ర ఖుర్‌ఆన్‌ను సంపూర్ణముగా ఆచరించనంత వరకు వారెలాంటి అభివృద్ధి సా ధించరు" (మల్ఫూజాత్ సంపుటి 4 పుట 379) |
|---|---|

దుఆ ఆశించువారు: *Mahmood Ahmad Babu sb, Ameer Zila, Mahaboob Nagar, (Telangana)*

| ఇమామ్ వాఖ్యములు | "ఇస్లాం నిజమైన విజ్ఞానమును ప్రసా దించును. తద్వారా మానవుని నేర జీవితము మృతి చెందును" (మల్ఫూజాత్ సంపుటి 4 పుట 344) |
|---|---|

దుఆ ఆశించువారు: *Muhammad Nazeer Ahmad sb, Ameer Zila warangal, (Telangana)*

చేయకూడదు. అన్ని విషయాలను అల్లాహ్‌కు అప్పగించుము. సహనంను వహించుము, సహనశీలతను ఎన్నడు వీడకూడదు. అల్లాహ్ సహన శీలురలతోనే ఉండును. ఒక మిత్రుడి వలే నాకు నచ్చజెప్పేవారు. మరల ఇలా వ్రాసినారు: వారి కోడలైన నా భార్యతో అనగా రానా గారు వారి కోడలితో కూడ ఒక మిత్రుని వలే వ్యవహరించేవారు. అంతకు మించి ఆమేను తన కుమార్తేల కన్న గొప్పగా చూసుకునేవారు. మరొక ఘటనను గూర్చి మరల వారిట్లు తెల్పినారు: రబ్వాలో అమ్మాజాన్ గారి ఇంట్లో పని చేయు భాగ్యం కూడ మా తండ్రి గారికి లభించినది. మొదట వారు వసియ్యత్ చేసిన తరువాత ఇతర బంధువులను కూడ వసియ్యత్ చేయాలని చూసించేవారు. క్రమబద్ధముగా చందాలు  చెల్లించేవారు. ప్రతి నెల 1వ తేదిన చందా చెల్లించేవారు. ఆ తరువాతనే ఇతర విషయాలకు ఖర్చు చేసేవారు. ఎవరికి తెలియకుండా ఇతరులకు ఆర్థిక సహాయం చేసేవారు. ఏనాడు కూడ ఈ విషయాలను గూర్చి ఎవరికి తెలియనిచ్చేవారు కాదు. వారి కుమార్తేలు ఇలా వ్రాసారు: అబ్బాజాన్‌కు ఖిలాఫత్ పట్ల ఉన్న అనుబంధమును చూసి మాకు ఈర్ష కలిగేది. వారి నరనరాలలో ఖిలాఫత్ పట్ల అమితమైన అభిమానం కనిపించేది. వర్తమాన ఖలీఫాల ప్రస్తావన ఎప్పుడు వచ్చినను వారి కన్నులు చెమ్మగిల్లేవి.

అధికారుల పట్ల వారికున్న గౌరవంను గూర్చి వారి పెద్ద కుమార్తే ఈ విధముగా వ్రాసారు: ఒకసారి మేము అక్కాచెల్లెలము అందరము అబ్బాజాన్ తో కలసి ప్రైవేట్ సెక్రటరి కార్యాలయంలో  కూర్చోని ఉన్నాము. లోనికి వెళ్ళి కలుసుకొను అవకాశం కోసం ఎదురు చూస్తున్నాము. ఇంతలోనే అబ్బాజాన్ డ్యూటిలో ఉన్నట్లుగా సావదానిలో నిలబడి ఉండడంను చూశాము. ఒక్కసారిగా ఏమి జరిగింది అని మేము ఆశ్చర్యపోయాము.  మెల్లిగా తల ఎత్తి చూడగా, అంతరంగిక రక్షణ ఉపాధికారి ఏదో పని మీద కార్యాలయమునకు వచ్చారు. లేదా బహుశా డ్యూటి చేయుటకు వచ్చి ఉండవచ్చును. వారి గౌరవార్థం మా తండ్రి గారు లేచి నిలబడ్డారు. వారు అక్కడ ఉన్నంత సమయం అలాగే నిలబడి ఉన్నారు. వారు బయటికి వెళ్ళిపోయిన తరువాత అబ్బాజాన్ కూర్చున్నారు. బహుశ ఇది ఒక నిమిష కాలమై ఉండవచ్చును. కాని ఆ సమయం  మాకు చాలా విషయాలను నేర్పినది. జీవితంలో ప్రయోజకులు కావాలని భావించినచో ఇనుము ఐస్కాంతముతో అతికినట్లుగా ఖిలాఫత్‌తో అనుబంధము ఏర్పర్చుకోవాలని వారు జీవితాంతం మాకు హితబోధ చేసేవారు.  మరల వారిట్లు తెల్పిరి: అబ్బాజాన్ కొన్ని రోజులకు ముందే మా నలుగురు అక్కాచెల్లల్లకు మరియు సోదరుడికి, వదినకు పండుగ బహుమానం ముందుగానే ఇచ్చాడు. అబ్బాజన్ ఇంకా రమజాన్ మాసమే ప్రారంభం కాలేదు కదా అని అడుగగా, సమయం ఎలా ఉంటుందో ఎవరికి తెలుసు. తమ బాధ్యతను  నెరవేర్చుటలో ఆలస్యం చేయకూడదు అని సమాధానం ఇచ్చారు.  అలా వారు తమ మరణం కంటే కొన్ని రోజుల ముందే పిల్లలకు పండుగ బహుమానం కూడ ఇచ్చారు.

వారి కోడలు ఇలా తెల్పినారు: నా మంచి చెడులు బాగా చూసుకునేవారు. ఎల్లప్పుడు తండ్రిలా నాకు మంచి చెడులను గూర్చి నచ్చజెప్పేవారు. తండ్రి గారు మరణించిన విషయం తెలియగానే అనగా రానా గారి కోడలు తండ్రి గారి మరణ వార్త తెలియగానే కొడుకును పిలిచి మీ భార్యభర్తలు ఇరువురు పాకిస్తాన్‌కు వెళ్ళి వారి జనాజలో పాల్గొని రండి అని పంపించారు.   మరల వారి కోడలు ఇలా వ్రాసారు: రాత్రి వేళ నాకు మేలుకువ వచ్చిన సమయంలో చూడగా వారు నమాజ్ చేస్తూండేవారు.  ఖిలాఫత్ పట్ల వారికి అమితమైన అభిమానం ఉండేది. వారిని గూర్చి వ్రాసేవారందరు ఈ విషయాన్ని వ్రాసారు. వారికి ఖిలాఫత్ పట్ల విధేయత చాలా అధికముగా ఉండేది. ఖిలాఫత్ దుఆల శుభముల వలనే నేను జైలులో సురక్షితముగా ఉన్నాను, ఖిలాఫత్ దుఆల శుభముల వలనే నేడు ఇక్కడ సురక్షితముగా ఉన్నానని తెలుపేవారు. మరల వారిట్లనిరి.  ఏ దేశ అధ్యక్షుడు వారి మరణ శిక్షపై సంతకం చేశాడో ఆ దేశ అధ్యక్షుడు ఖిలాఫత్ దుఆల వలన ఏమైపోయాడో ఎవరికి తెలియదు కాని, రానా గారు మాత్రం ఒక సజీవ నిదర్శనంగా ప్రపంచం ముందు  నిలబడ్డారు.

వారి మరొక కుమార్తే ఆబిద గారిట్లు వ్రాసారు:  దేవునితో, ఖిలాఫత్‌తో దృఢ అనుబంధమును ఏర్పర్చుకొమ్మని ఎల్లప్పుడు మా పిల్లలకు హితోపదేశం చేసేవారు. ఇందులోనే మీ జీవితం గలదని, పవిత్ర ఖుర్‌ఆన్‌ను  పారయణం చేయాలని, నమాజ్ మరియు తహాజ్జుద్‌లను క్రమం తప్పకుండా సలుపాలని సూచించేవారు. మరల వారిట్లు తెల్పిరి.  వారు తహాజ్జుద్‌ను వదిలి వేయడంను నేను నా జీవితంలో ఎన్నడు చూడలేదు. మా కొరకు వారు ఒక దుఆల ఖనిజ సంపదగా ఉండేవారు.  చాలా గొప్పగా ఆతిథ్యం చేసేవారు. పేద బంధువులకు సహాయం చేసేవారు. తమ తండ్రి గారి అనగా రానాగారు తమ తల్లిదండ్రులు మరియు వారి భార్య చందాలను వారు మరణించిన తరువాత కూడ క్రమ బద్ధముగా చెల్లించేవారు.  ఒక పధ్యపంక్తిని ఎల్లప్పుడు వారు  గట్టిగా చదవడాన్ని నేను  విన్నాను.

రాజిహై హం ఉసీ మే – జిస్‌మే తేరి రజా హో

అనగా నీ ప్రీతిలోనే మాకు ప్రీతి పాత్ర గలదు.

మరల వారి కుమార్తే ఇలా వ్రాసారు:  తల్లి గారు మృతిచెందిన తరువాత మా అక్కా చెల్లలను ఎలాంటి లోటు లేకుండా పెంచారు. తన కోడలిని కూడ కూతుళ్ళ కంటే ఎక్కువగా చూసుకున్నారు. ఏ వస్తువు తీసుకవచ్చిన లేదా పండుగా కానుకలు ఇవ్వవలసి వచ్చినను ముందుగా కోడలికి ఇచ్చేవారు. ఆ తరువాతనే మాకు ఇచ్చేవారు. ఒకరి కూతురును మన ఇంటికి తీసుక వచ్చినప్పుడు ఆమే మంచి చెడులను చూసుకోవలసిన బాధ్యత మనపైనే ఉంటుందని, ఈ విషయంలో దేవునికి సమాధానం ఇవ్వవలసి ఉంటుందని వారు పదే పదే గుర్తు చేసేవారు.

వారి మరొక  కుమార్తే ఇలా వ్రాసారు: నిజానికి వారు జైలులో గడిపిన జీవితాన్ని దేవుని ప్రీతితో, ధార్మిక అభిమానంతో, ఖిలాఫత్ పట్ల ఉన్న అభిమానంతోనే గడిపారు.  వారి నోటి నుండి ఎన్నడు కూడ  ఎలాంటి అసహనం వెలువడలేదు. పైగా ఉఫ్ అనే పదం కూడ రాలేదు. నమాజ్‌ల విషయంలో గాని, తహాజ్జుద్ విషయంలో గాని ఎన్నడు వారు ఆలస్యం చేసేవారు కాదు. అనారోగ్యముగా ఉన్నప్పటికి ఆలస్యం చేసేవారు కాదు. జైలులో ఉన్నప్పుడు వారి కిడ్నీలు పాడైపోయాయి. అవి వారి చివరి జీవితంలో చాలా ఇబ్బంధులకు గురి చేశాయి. శ్వాసకోశ ఇబ్బందులతో పాటు ఇతర

**హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సత్యమునకు ఒక గొప్ప నిదర్శనము**

وَلَوْ تَقَوَّلَ عَلَيْنَا بَعْضَ الْأَقَاوِيلِ. لَأَخَذْنَا مِنْهُ بِالْيَمِينِ. ثُمَّ لَقَطَعْنَا مِنْهُ الْوَتِينَ.

అనగా కొన్ని విషయములను అతడు (ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం) మా వైపు అంటగట్టి యుండినచో మేము అతనిని తప్పక కుడి చేతితో బంధించువారము. తరువాత నిశ్చయముగా మేము అతని మెడనరమును కోసివేయువారము. (అల్‌హాఖ్ఖహ్:45-47)

అహ్మదియ్యా జమాఅత్ స్థాపకులైన హజ్రత్ అఖ్దస్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని మసీహ్ మౌవూద్ మహ్ది మహూద్ అలైహిస్సలాం ఇస్లాం సత్యము, ఆహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంతో తన ఆధ్యాత్మిక బంధము గురించి అనేక సార్లు అల్లాహ్ తఆలా ప్రమాణము చేయుచు “నేను అల్లాహ్ తఆలా తరపున అవతరించినాను” అని చెప్పినారు. ఇటువంటి ఎన్నో ఉపదేశములను సమకూర్చి ఒక పుస్తకము

**“అల్లాహ్ ప్రమాణము”**

పేరిట ప్రచురించబడినది. ఈ పుస్తకమును పొందుటకు ఆసిక్త గలవారు  క్రింది చిరునామా/ఇ మెయిల్ ద్వారాసంప్రదించి ఉచితముగా పొందగలరు.

Postal Address: Muhammad Javed Ahmad, H.No. 3-4-772, Opp: C.C.Shroff Hospital, BARKATPURA, KACHIGUDA, 500 027.
Mobile:98663 58609,75693 58609, email: javidashu123@gmail.com

ఇబ్బందులు కూడ ఉండేవి. మరల వారిట్లు తెల్పినారు: ఏనాడు కూడ మేము ఆందోళనకు గురి అయ్యే విధముగా ప్రవర్తించలేదు. ఎల్లప్పుడు కృతజ్ఞతతో కూడిన పదాలు, అల్ హందులిల్లాహ్ వంటి పదాలు గాకా మరేమి వారి నోటి నుండి వెలువడేవి కావు.

మరల వారి కుమార్తె ఇలా వ్రాసారు: మా విషయంలో చాలా శ్రద్ద వహించేవారు. అబ్బాజాన్ మాతో ఒకసారి ఇలా అన్నారు: నాకు వయస్సు మీద పడుతుంది, నాకు సుమారుగా 87 లేదా 88 సంవత్సరాలు వచ్చాయి, మరణం ఎప్పుడు వస్తుందో ఎవరికి తెలియదు, ఒకవేళ నేను లేనిచో లేదా మరణించినచో మీరు నన్ను పాకిస్తాన్‌కు తీసుకవెళ్ళండి. అందుకు మీరు మీ భర్తలకు భారం కాకూడదని నేను ముందుగానే మీ అందరి కొరకు టికెట్‌కు సరిపడ డబ్బులు దాచిపెట్టాను కావున మీరు నా జనాజను సులువుగా తీసుకవెళ్ళండి. మీ తండ్రి డబ్బులతోనే మీ తండ్రి జనాజను తీసుక వెళ్ళండి అని తెల్పినారు. ఇప్పుడున్న పరిస్థితుల దృష్ట్యా వారి జనాజను తీసుక వెళ్ళలేరు. కావున ప్రస్తుతం ఇక్కడే సమాధి చేయబడింది. తరువాత కాలంలో మార్గాలు తెరుచుకున్న తరువాత వారి కోరిక మేరకు వారి జనాజను పంపించుటకు ప్రయత్నించగలము.

వారి సోదరుడి కుమారుడు రానా షబ్బీర్ గారు రబ్వాలోని తాహిర్ హార్ట్ లో సేవలందిస్తున్నారు. వారిట్లు తెలిపారు. వారు ఖైదిగా ఉన్న రోజులలో వారిని అనేక సార్లు కలిసే అవకాశం లభించింది. వారికి జైలులో సామాగ్రి అందించు విషయంలో కొన్ని సమస్యలు ఎదురయ్యేవి. అయినా కూడ వారు మాకు సహనంను పాటించమని, దుఆలు చేయగలరని సూచించేవారు. ఎంతో గొప్ప మహాత్ములు. చాలా సహన శీలురులు. అదే విధముగా వారి భార్య సోదరుడి కుమార్తె రుబీనా గారు ఇలా వ్రాసినారు: 1980 వరకు వారు ఖిలాఫత్ భవనంలోనే ఉండేవారు. మేము జల్సాలో పాల్గొనుటకు వెళ్ళినప్పుడు మాతోపాటు కొన్ని సందర్భాలలో అహ్మదియేతర మిత్రుల కుటుంబాలు కూడ జల్సాను తిలకించుటకు వచ్చేవి. జల్సాలో బంధువు మిత్రులందరు వారి ఇంటికే వెళ్ళేవారు. మా మేనమామా గారు మా మేనత్తకు పదే పదే ఇలా సూచించేవారు. అతిథులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించుము. భోజనం విషయంలో, నిద్రవిషయంలో వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకూడదు. ఒకవేళ చోటు లేనిచో నీవు పిల్లలను తీసుకొని సామాగ్రి గదిలోగాని, వంట గదిలో గాని పడుకో, అతిథులకు మాత్రం సామాన్య గదులలో, ప్రాంగణములలో మంచి ఏర్పాట్లు చేయుము అని తెలిపేవారు. మరల వారిట్లు అనేవారు. వీరు మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి అతిథులు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకూడదు. వారి సోదరి కుమారుడు వారిని గూర్చి ఇలా వ్రాసారు: నేను వారిని కలవడం కోసం జైలుకు వెళ్ళాను. నేను వారి మంచి చెడులను, జరిగిన ఘటనలను గూర్చి తెలుసుకొనుటకు ప్రయత్నించగా, వారు కుమారా! ఏది ఏమైనప్పటికి కలిమాను కాపాడవలెను. ఈ క్రమంలో ఒకవేళ ప్రాణాలు అర్పించ వలసి వచ్చినను వెనుకాడకూడదు అని ఉద్వేగభరిత కఠంతో సమాధానమిచ్చారు. వారి మేన అల్లుడు మరల ఇలా వ్రాసెను. వారి నోటి నుండి వెలువడిన పదాలు మానవుని నుండి గాకుండా దేవదూతల నోటి నుండి వెలువడినట్లుగా గోచరించాయి. ఎంతో ధైర్యవంతులు, వీరులు. కలిమాను కాపాడువారు, ఖిలాఫత్ పట్ల అమితమైన అభిమానంను కల్గిన ధైర్యవంతులు, అహ్మదియ్య ముసల్మానులు వీరు.

మరల వారిట్లు తెల్పినారు. నేను బెల్జియం నుండి లండన్ వచ్చిన తరువాత వారు నాతో ఇలా అన్నారు. ఇక్కడి వచ్చినచో ఖిలాఫత్‌లో లీనమైపోవాలి. ఖిలాఫత్ వలనే ఇక్కడి వచ్చారు కావున వర్తమాన ఖలీఫా గారి ప్రతి ఆదేశాన్ని పాటించాలి. అలా కానిచో ఇక్కడికి వచ్చి కూడ ఏం ప్రయోజనం లేదని గుర్తుంచుకో. మరల వారిట్లనిరి: క్రమం తప్పకుండా నమాజ్‌లను సలుపుము. ఎల్లప్పుడు అల్లాహ్ తాలా వైపు ఆసక్తిని కనబర్చుము. ఏ సమస్య వచ్చినను భయపడకుము అని నచ్చజెప్పేవారు. అబద్దీకులను, దాంబికులను హేవగించుకునేవారు. తమ డ్యూటి విషయంలో చాలా శ్రద్దను కనబర్చేవారు, వారికి ఏరోజైన ఆరోగ్యం క్షీణించినచో ఈ రోజు మీరు విశ్రాంతి తీసుకోండి అని కుటుంబ సభ్యులు సూచించగా, నా ఆరోగ్యం బాగుగానే ఉన్నది. ఇవి నా బహుమాన దినములు. ఈ వృద్ధాప్యంలో నాకు సేవచేయు భాగ్యము లభిస్తుంది. కావున అట్టి భాగ్యమును పొందనివ్వండి అని అనేవారు.

జైలులో రానా గారితో పాటు ఖైదిగా ఉన్నటు వంటి ఇల్యాస్ మునీర్ గారు ఇలా తెల్పినారు. రానా గారితో నా జీవితపు ఒక భాగం గడిచి పోయింది. ఈ చివరి క్షణంలో వారిని చూడలేని స్థితి. నా మనస్సు చాలా ఆందోళన చెందుతుంది. రానా సాహెబ్ గారితో పాటు నేను 10 సంవత్సరాల జైలు జీవితాన్ని గడిపాను. ఏ ఒక్కరోజు కూడ వారు నిరాశకు గురి కావడంను నేను చూడలేదు. చివరికి సైన్యాధక్షుడి నుండి మరణ శిక్ష విధించినట్లు దౌర్జనపూర్తి తీర్మాణంను వినిపించిన కూడ ఆ తీర్పును కూడ ఎంతో సంతోషముగా స్వీకరించారు. ఆ సమయంలో వారికి చాలా మంది పిల్లలు ఉన్నారు. అందరు చిన్న పిల్లలే. వారి జీవన విధానానికి ఒక ప్రత్యేక ఆధాయం అంటూ ఉండేది కాదు. అయినా కూడ అల్లాహ్ తాలాపై వారికి చాలా నమ్మకం ఉండేది. జమాఅత్‌కు సేవ చేయాలనే ఉత్సాహం వారిలో కనిపించేది. జమాఅత్ గౌరవాన్ని కాపాడలనే తపన వారికి ఉండేది. వారు ఏ రోజైన ఏదైన సమస్యను చూసినచో శత్రువుల ఉద్దేశాలు చాలా భయంకరముగా ఉన్నాయి. అల్లాహ్ తాలాయే వారి దుష్టత్వం నుండి మనలను కాపాడు గాకా! అని మాత్రమే అనేవారు. అల్లాహ్ తాలా కూడ వారి పనులన్నింటిని చక్కబెట్టాడు. వారు ఖైధిగా ఉండగానే పిల్లల పెళ్ళిళ్లు జరిగిపోయాయి.

ఇల్యాస్ మునీర్ గారు మరల ఇలా వ్రాసారు: జరిగిన ఘటనను గూర్చి వారు ఇలా సంక్షిప్తముగా వ్రాసారు. బల్వాయిలు మస్జిద్‌పై దాడి చేసి కలిమాను మరియు సూక్తులను, హదీస్ వాఖ్యాలను అగౌరవ పరుస్తుండగా చూసిన ఆ దృశ్యాన్ని నేటికి నేను మర్చిపోలేను. ఇలా వారు ఎదురించి మాట్లాడడంను నేను మొదటిసారిగా విన్నాను. కలిమాను తూడ్చుటకు మీరెవరు?. కలిమను తూడ్చుటకు రావడానికి మీరెవరు? అని గట్టిగా ఎదురించారు. అంతకు ముందు వారు ఉర్దూలో ఇంత ఉద్వేగంగా మాట్లాడుతుండగా నేను ఎన్నడు వినలేదు. కాని ఆ సమయంలో వారు ఉద్వేగంగానే మాట్లాడారు. ఎంతో గట్టిగా మాట్లాడారు. వారు ఒక్కరే 30, 40 మందిని ముందుగా మస్జిద్‌లో ఒక మూలకు దాచుకొనునట్లుగా, ఆ తరువాత పారిపోవునట్లుగా భయభ్రాంతులకు గురి చేశారు. మరల వారిట్లు వ్రాసారు: వారు కేవలం ఈ కార్యకలాపాన్ని ఎంతో ధైర్యముగా చేయడమే గాకుండా, పోలీస్ అధికారులు వచ్చి కాల్పులు జరిపింది ఎవరు అని ప్రశ్నించగా, వారు ఒక్క క్షణం కూడ ఆలస్యం చేయకుండా వెంటనే ముందుకు వచ్చి నేను కాల్పులు జరిపాను అని సమాధానమిచ్చారు. ఆ తరువాత వారిపై అనేక విధాలుగా దౌర్జన్యం చేస్తూ వారి నోటి నుండి జమాఅత్ పదవి దారుల పేర్లను చెప్పించాలని, వారు చెప్పినందుకే ఇలా చేశాను అని చెప్పించుటకు చాలా ప్రయత్నాలు చేశారు. కాని జమాఅత్ వ్యవస్థపై ఏ మాత్రం భంగ పాటు రాకుండా వ్యవహరించిన ఆ సింహ హృదయాన్ని ప్రశంసించకుండా ఉండలేము. వాస్తవము కూడ ఇదే . అసలు వారి వద్ద వారి వ్యక్త గత తుపాకి ఉన్న విషయం జమాఅత్ పదవి దారులకు కూడ తెలియదు. ఆ తరువాత సైన్యపు న్యాయస్థానంలో , ఒక ప్రత్యేకమైన న్యాయస్థానము అది, అక్కడ కూడ ఎలాంటి ఒత్తిడికి గురి కాలేదు. మాట పూర్వకముగా, వ్రాత పూర్వకముగా ఎంతో స్పష్టముగా, ధైర్యంతో, వీరత్వంతో కాల్పులు జరిపింది తానేనని స్వీకరించారు. వారి ధైర్య, సహసాలు, వారి స్పష్టత మరియు వారికి జమాఅత్ వ్యవస్థ పట్ల ఉన్న గౌరవం వలన అల్లాహ్ తాలా కూడ చివరికి వరకు వారికి సేవ చేయు భాగ్యమును కల్పించాడు. ఖిలాఫత్‌తో కలసి సేవ చేయు భాగ్యమును వారి తుది శ్వాస వరకు అందించాడు.

మరల ఇల్యాస్ మునీర్ గారే ఈ విధముగా వ్రాసారు: ఖైదిగా ఉన్న సమయంలోనే వారి తండ్రి గారికి అనగా ఇల్యాస్ మునీర్ తండ్రి గారికి ఖలీఫతుల్ మసీహ్‌రాబెహ్ గారి నుండి జుమా ప్రసంగం ఉత్తర రూపంలో

వచ్చేది. ఆ కాలంలో ఎం.టి.ఏ లేకుండెను. ప్రతి జుమా ప్రసంగం వ్రాతపూర్వకముగా పంపించే ఏర్పాట్లు చేయబడేవి. మరల ఇట్లనిరి. రానా గారు నన్ను తన ప్రక్కన కూర్చొబెట్టుకొని జుమా ప్రసంగాన్ని వినిపించమని కోరేవారు. అలా మేము మరణ శిక్షకు చెందిన బ్యారక్‌లో ఉన్నంత కాలం కొంత సమయం కొరకు మమ్ములను బ్యారక్ నుండి బయటికి వదిలేవారు. అలా మమ్ములను బయటికి వదిలిన సమయంలో మేము వేరు వేరుగా ఉండేవారము కాదు. మా ఇద్దరిని బయటికి వదిలినప్పుడు మేము ఇరువురం కలసి ఆ సమయాన్ని కేవలం జుమా ప్రసంగాన్ని వినడం కొరకే వెచ్చించే వారము. ఎంతో శ్రద్ధతో వారు జుమా ప్రసంగాన్ని వినేవారు.

మరల వారిట్లు తెల్పినారు: నమాజ్‌లు సామూహికముగా కలసి చదువుటకు అవకాశం లభించినచో ఆయా నమాజ్‌లను సామూహికముగానే సల్పుటకు ప్రయత్నించేవారము. కొన్ని సందర్భాలలో జైలులో ఉన్నటువంటి ఇతర అహ్మదీయేతర ఖైదీలను కూడ పిలుచు కునేవారము. రమజాన్ మాసంను గూర్చి వారు ఇలా తెల్పినారు: మేము జైలులో ఉన్న సమయంలో మే, జూన్, జులై వంటి తీవ్ర ఎండకాలంలో రమజాన్ మాసాలు వచ్చేవి. గౌ॥ రానా గారు పెద్ద వయస్సు గల వారైనను, జైలు బాధలు అనుభవిస్తూ కూడ ఉపవాస దీక్షను పాటించేవారు. మరల ఇట్లనిరి. ఊహకందని అద్భుతమైన ధైర్య, సహసాలు వారు ప్రదర్శించారు. ఎంతో వివేకంతో ప్రతి సమస్యను ఎదుర్కొన్నారు. వారికి మరణశిక్ష తీర్పు వినిపించిన తరువాత కూడ వారు ఎంతో ధైర్యముగా జీవితాన్ని గడిపారు. వారి ఈ ధైర్య సహసాలను ఇతరులు కూడ గుర్తించారు. మరల ఇట్లనిరి. మరణ శిక్షతో కూడిన తీర్పును వారికి అందిచడం జరిగింది. ఆ తీర్పుపై చివరి సంతకం కూడ చేయడం జరిగింది. ఆ సమయంలో ఒక జైలు వార్డన్ రానా గారి వద్దకు వచ్చి ఓ మహానుభావుడా! ఈ మిర్జాగారి శిష్యులు చాలా విచిత్రముగా ఉన్నారు. వారికి మరణ శిక్షను విధించు తేదిని మరియు వారి జీవితము చివరి ఘట్టమునకు చేరుకుందని తెల్పినను వారి ముఖములో ఎలాంటి మార్పు కనిపించడం లేదు, వారు ఆ విషయాన్నే అంతగా పట్టించుకోవడం లేదు, కొంచం కూడ చలించడం లేదు అని తెల్పగా, రానా గారు మరల ఇట్లు తెల్పిరి: తాను ఎవరో గుర్తుపట్టలేదని అర్థం చేసుకున్న రానా గారు ఆ జైలు వార్డన్‌ను నా ముఖములో నీవు ఏమైన మార్పును చూశావా? అని ప్రశ్నించెను. అందుకు అతడు నేను ఎలాంటి మార్పును చూడలేదని సమాధానమునిచ్చాడు. అప్పుడు రానా గారు అతనికి " నేను కూడ అహ్మదీయుడినే" అని చలించి పోయే నగ్న సత్యాన్ని తెలిపెను.

చివరిలో హజ్రత్ ఖలీఫతుల్ మసీహుర్రాబేహ్ గారి ఒక ఉత్తరమును కూడ చదివి వినిపించెదను. ఈ ఉత్తరమును రానా గారికి సెప్టెంబర్ 1986లో వ్రాయడం జరిగింది. అందులోని కొంత భాగాన్ని మీ ముందు చదువి వినిపించెదను. "అభిమానంతో కూడిన నీ ఉత్తరము నాకు అందినది. గర్వించబడునట్టి దృఢ విశ్వాసపు ఉన్నత శిఖరంపై మీరు నిలబడి ఉన్నారు. దైవ జనులకు ఉన్నత స్థాయిని పొందుటకు ఇలాంటి కఠినమైన మార్గాల నుండి తప్పకుండా వెళ్ళవలసి ఉంటుంది. మీ అదృష్టాన్ని చూసినచో ఆశ్చర్యం వేస్తుంది. వృక్షము ఎల్లప్పుడు దాని ఫలముల ద్వారానే గుర్తించబడుతుంది. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి వృక్షానికి పచ్చని కొమ్మలు మీరు. తీయని ఫలములు మీరు. అల్లాహ్ తాలా మీమ్ములను వృథా చేయడు. జమాఅత్ సభ్యులందరు దుఆలు చేస్తున్నారు. నా దుఆలు కూడ మీకు పుష్కలంగా గలవు. మీరు నా నూతన పద్యాన్ని కూడ విన్నారని ఆశిస్తున్నాను. అందులో మీకు మరియు మీలాంటి స్వచ్ఛత గలవారి ప్రియులకు సలాంలు, సందేశములు గలవు. అల్లాహ్ తన దేవ దూతల ద్వారా మీకు సహాయంను అందించుగాకా!, శత్రువుల పంజా నుండి మిమ్ములను విడిపించుగాకా! అల్లాహ్ మీ వెంటే ఉండు గాకా!. ఈ ఉత్తరాన్ని ఖలీఫతుల్ మసీహుర్రాబేహ్ గారు రానా సాహెబ్ గారి కొరకు వ్రాసారు.

ముబారక్ సిద్దీఖీ గారు ఇలా తెల్పినారు: ఒకసారి నేను వారితో వారి జైలు జీవితంను గూర్చి, జైలులో అనుభవించిన కష్టాలను గూర్చి అడిగి తెలుసుకోగా, వారు చిరునవ్వు చిందిస్తూ అహ్మదీయుల జీవితం అల్లాహ్ మరియు అతని ప్రవక్త మరియు అతని ఖలీఫాల విధేయతకే అంకితం. అందుకే నాకు ఏ సమస్య కూడ కష్టముగా అనిపించలేదు. అన్ని సందర్భాలలో నేను అల్లాహ్ ప్రీతినే నా ప్రీతిగా భావించాను అని సమాధానమిచ్చారు. నిశ్చయముగా వారు వారి తుది శ్వాస వరకు అల్లాహ్ ప్రీతికి అనుగుణముగానే జీవించారు. మీరు ఎలా ఉన్నారు? అని నేను ఎప్పుడు వారిని ప్రశ్నించినా, సమాధానముగా అల్ హందులిల్లాహ్ అని మాత్రమే పలికేవారు. ఆసుపత్రి నుండి వచ్చిన మరుసటి రోజే డ్యూటికి వచ్చేవారు. నేను ఆరోగ్యముగానే ఉన్నాను అని తెల్పుచూ నన్ను కూడ దుఆలతో దీవించేవారు.

నేను ముందుగా తెల్పినట్లుగా ఒక డాక్టర్ గారు ఇలా తెల్పినారు. ఇలాంటి అనారోగ్య లక్షణాలు గలవారు అనగా వారి కాళ్ళు వాచిపోయేవి. ఇంటి నుండి బయటికి వెళ్ళడం చాలా కష్టం. కాని వీరు మాత్రం డ్యూటికి వచ్చి నిలబడేవారు. ఈ విషయాన్ని చూసి డాక్టర్ గారే ఆశ్చర్య పోయేవారు. కాని వారిలో ఉన్నటు వంటి ఉత్సాహం, ఖిలాఫత్ పట్ల వారికి ఉన్నటు వంటి ప్రేమ, ఖలీఫాకు సమీపంలో ఉండాలనే తపనే వారిని మస్జిద్‌కు తీసుక వచ్చేదని, డ్యూటి చేయించేదనే విషయం ఆ డాక్టర్‌కు ఏం తెలుసు?. నేను వారి ముఖములో ఎల్లప్పుడు సంతృప్తినే చూశాను. ఖిలాఫత్ కొరకు అభిమానంను చూశాను. అల్లాహ్ తాలా వారికి పరలోకంలో కూడ ప్రేమానురాగాలతో సత్కరించు గాకా!, తమ ప్రీయమైన వారి సన్నిధిలో చోటును ప్రసాదించు గాకా!.

వారు నాకు నా బాల్యం నుండే తెలుసు. నేను ముందుగా తెల్పినట్లు వారు హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సానితో పాటు జాబా నఖ్లాకు వెళ్ళేవారు. మేము కూడ వేసవి కాలంలో కొన్ని రోజుల కొరకు ఆ ప్రదేశానికి వెళ్ళేవారము. ఆ సమయంలో కూడ వారు మాతో చాలా ప్రేమగా వ్యవహరించేవారు. ఖలీఫాగా ఎన్నుకోబడిన తరువాత నా పట్ల వారి ప్రేమాభిమానలకు అంతు లేకుండెను. ఖిలాఫత్ పట్ల వారికి ఉన్నటు వంటి విధేయతను, వారి భావాలు, వారి ఉద్రేకములను గూర్చి ముందుగా వినే వారము. కాని తరువాత రోజులలో అవి మాకు ప్రతిరోజు కనిపించసాగాయి. అల్లాహ్ తాలా వారి పిల్లలకు ఎల్లప్పుడు విధేయతతో వారి తండ్రి గారి అడుగుజాడలో నడుచు భాగ్యమును కల్పించు గాకా!, పరిస్థితుల కారణంగా వారి జనాజ నమాజ్‌ను చదువించలేక పోయాను. నేను కూడ చదవలేక పోయాను. ప్రభుత్వ ఆంక్షలు కూడ గలవు. ......ఈ విషయం చాలా బాధిస్తుంది. ఇన్షా అల్లాహ్ తాలా మరొక సందర్భములో వీరి పరోక్ష జనాజ నమాజ్‌ను చదువించెదను.

చివరిలో మరల నేను ప్రస్తుతం వ్యాపిస్తున్నటు వంటి వ్యాధిని గూర్చి తెలుపదలు చుకున్నాను. కొందరు అహ్మదీయులు కూడ ఈ వ్యాధి భారిన పడ్డారు. వారి కొరకు కూడ దుఆలు చేయండి. అల్లాహ్ తాలా అందరికి సంపూర్ణ స్వస్థతను కల్గించుగాకా!, మనకు కూడ తన ప్రీతికరమైన మార్గములో నడుచు అవకాశాన్ని కల్పించు గాకా!, సరైన విధముగా మనకు ప్రార్థనల హక్కులను, దేవుని దాసుల హక్కులను చెల్లించు భాగ్యమును కల్పించుగాకా!, సాధ్యమైనంత త్వరలో ఈ వ్యాధిని మన నుండి దూరం చేయుగాకా!, ప్రపంచీకులకు కూడ బుద్దిని, జ్ఞానాన్ని ప్రసాదించుగాకా!, వారు కూడ ఏకేశ్వరుడిని గుర్తించుదురు గాకా!, దేవున్ని ఆరాధించుదురు గాకా!, ఏకేశ్వరత్వంను అర్థం చేసుకొందురు గాకా! అల్లాహ్ తాలా అందరిని కరుణించుగాకా!.

**నూరుల్ ఇస్లాం శాఖ:**

**అహ్మదియ్య ముస్లిం జమాఅత్‌ను గూర్చి సరైన వివరాలు తెలుసుకోవడం కోసం మీరు ఈ క్రింది టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించగలరు.**

**టోల్ ఫ్రీ నెంబర్: 1800 103 2131**

**సంప్రదించు సమయం: ప్రతిరోజు ఉదయం 08:30 నుండి రాత్రి 10:00 వరకు. (ప్రతి శుక్రవారం సెలువు).**

(2వ పేజి తరువాత) కావున ఈ మాసంలో అల్లాహ్ తాలా యొక్క కరుణ, క్షమాగుణాల ఇతర మాసాల కంటే ఎక్కువగా తన దాసులపై కురిపించుచున్నచో వాటి నుండి ప్రయోజనం పొందుటకు సాధ్యమైనంత మేరకు ప్రయత్నించవలెను. ఆపై ఎల్లప్పుడు అల్లాహ్ తాలా యొక్క ఈ ఆదేశమును గుర్తుంచుకోవలెను. వ మన్ తఅబ వ అమిల స్వాలిఅన్ ఫ ఇన్నహు యతూబు ఇలల్లాహి మతాబ (ఫుర్ఖాన్: 72). అనగా ఎవరైతే ప్రాయశ్చిత్తం చేయుచూ, సత్కార్యములు చేయుదురో, వారే స్వచ్ఛమైన ప్రాయశ్చిత్తముతో దేవుని వైపు మ్రొగ్గు చూపేవారగుదురు. ఇక్కడ స్వచ్ఛమైన ప్రాయశ్చిత్తముతో పాటు సత్కార్యములు చేయాలనే నిబంధన గలదు. కావున నేను ముందుగా తెల్పినట్లుగా, అల్లాహ్ తాలా ఈ విధముగా తెల్పుచున్నాడు. మధ్య దశకంను క్షమాప్రపూర్ణ దశకంగా ప్రకటించాడు. కావున అల్లాహ్ తాలా ప్రీతికి అనుగుణముగానే మన ఆచరణలు ఉన్నప్పుడే ఈ క్షమా ప్రపూర్ణత తన ప్రభావంను మనపై చూపిస్తుంది.

అలా అస్తెఘ్ఫార్‌లు మరియు సత్కార్యములు మనలను రమజాన్ మాసపు చివరి దశకంలోకి ప్రవేశింపజేసినప్పుడే ఆ చివరి దశకం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఆదేశం మేరకు అది మనలను నరకంనుండి కాపాడునది అవుతుంది. అల్లాహ్ తాలా ఒకచోట ఈ విధముగా తెల్పుచున్నాడు. వమా కాన అల్లాహు ముఅజ్జిబహుం వ హుం యస్తఘ్ఫిరూన్ (అల్ ఇన్‌ఫాల్ :34)అనగా క్షమాపణలు యాచించువారిని అల్లాహ్ శిక్షించడు.

ఏ విధముగా మీరు నా నుండి క్షమాపణలు పొందగలరు?, ఏ విధముగా నేను పూర్వపు జాతుల వారితో వ్యవహరించాను? అనే విషయాలను అల్లాహ్ తాలా అనేక విధాలుగా మనకు నచ్చజెప్పుటకు ప్రయత్నిస్తున్నాడు. ఇందుకై పూర్వికుల ఉదాహరణలను తెల్పుచూ, ప్రవక్తల సంఘటనలను తెల్పుచూ, ప్రవక్తల ద్వారా ఉపదేశింపజేయుచూ ఇప్పుడు కూడ నేను అదే విధముగా వ్యవహరించెదను అని తెల్పుచున్నాడు. మానవుడు ఒక ప్రత్యేక శ్రద్ధతో, దేవుని హక్కులను, అతని దాసుల హక్కులను నెరవేర్చుటకు ప్రయత్నిస్తున్నచో, తన నమాజ్‌లను కూడ కాపాడుకుంటున్నచో, నవాఫిల్ ద్వారా కూడ వాటిని అందముగా మలుచుచున్నచో, అస్తెఘ్ఫార్‌లు కూడ చేయుచున్నచో ఇతర సత్కార్యములను కూడ కొనసాగించుచున్నచో అలా చివరికి హదీస్‌లో పేర్కొన్నట్లుగా ఒకవేళ అతనితో ఎవరైన తగాదపడినను, దూషించినను అతడు ఏ మాత్రం తిరిగి సమాధానం ఇవ్వకుండా కేవలం నేను ఉపవాసంను పాటిస్తున్నాను అని మాత్రమే సమాధానం ఇచ్చి మౌనంను పాటించవలెను. ఆపై నేను శిక్షణా కాలంలో ఉన్నాను. కావున దేవుని ఆదేశాలను నా జీవితంలో భాగముగా చేసుకోవాలని భావించాలి. అప్పుడే అలా భావించిన వ్యక్తి తప్పకుండా దేవుని ప్రీతిని పొందగలడు. అతడు అల్లాహ్ తాలా ప్రీతిని పొందుతూ నిశ్చయముగా నరకం నుండి మోక్షమును పొందును. అలా అతడు దేవుని స్వర్గములోకి ప్రవేశించును. నేను ప్రారంభములో ఒక హదీస్‌ను ఆధారముగా తెల్పినాను. ఆ హదీస్ వివరణలో ఈ విధముగా కూడ పేర్కొనబడడం జరిగింది. ఏ వ్యక్తి అయినా ఈ మాసంలో ఉత్తమ లక్షణమును అలవర్చుకున్నచో అనగా ఏదేని మంచి పనిని ప్రారంభించినచో, ఆ పనిని కొనసాగించినచో లేదా ఏదేని సత్కార్యమును ఆచరిస్తున్నచో అతడు ఇతర అన్ని బాధ్యతలను నెరవేర్చిన వాడగును. అతనిపై ఉన్నటు వంటి బాధ్యతలను అతడు నెరవేర్చినట్లగును. ఎవరైన ఏ ఒక్క బాధ్యతనైన ఈ మాసంలో అలవర్చుకున్నచో అతడు రమజాన్ మాసంలో కాకుండా ఇతర రోజులలో 70 బాధ్యతలను నెరవేర్చినవాడగును. మరియు రమజాన్ మాసం సహనంను పాటించు మాసం. ఈ మాసంలో సహనం పాటించడం వలన స్వర్గం ప్రతిఫలంగా లభించును. ఇది సోదర బాంధవ్యాలను నెరవేర్చునట్టి మాసం. అనగా ఇతరుల బాధలను పాలుపంచుకోవడం వంటింది. ఇతరులతో మృదువుగా వ్యవహరించడం, ఇతరులను క్షమించివేయడం. పరస్పరం ప్రేమాభి మానాలను, సోదర బాంధవ్యములను నెలకొల్పడం. ఈ సత్కార్యములన్ని దేవుని హక్కులను అతని దాసుల హక్కులను చెల్లించుట వైపు మానవున్ని తీసుకెళ్ళును. ఒక విధముగా చూసినచో పైన పేర్కొనబడినవి ఈ హక్కుల విశ్లేషణలోని భాగాలే.

ఎవరిలోనైతే ఈ సద్గుణాలన్ని ఉండునో వారికి నరకం నుండి మోక్షం లభించునని ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం శుభవార్తను అందించారు. క్రమం తప్పకుండా సత్కార్యములను కొనసాగించువారికి, అల్లాహ్ తాలా ఆదేశానుసారం ఆచరించువారికి, తమపై చేయబడే దౌర్జన్యంపై సహనంను పాటించువారికి అల్లాహ్ మరియు అతని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం స్వర్గపు శుభవార్తనిచ్చారు.

సాధారణముగా రమజాన్ మాసములో పాకిస్తాన్‌లో మరియు ఇతర దేశాలలో పేరు గాంచిన ఉలమాలు తమ ప్రభావాన్ని ప్రదర్శిస్తూ, ముసల్మానులను చెడు మార్గాలపై నడిపిస్తుంటారు. అహ్మదీయులపై దౌర్జన్యం చేయుటకు క్రొత్త క్రొత్త మార్గాలను అన్వేషించడం జరుగుతుంది. ఈ దృశ్యాలు మనకు కనిపిస్తూనే ఉన్నాయి. నేను గత జుమా ప్రసంగంలో కూడ ఈ విషయాన్ని తెల్పినాను. అహ్మదీయులను మానసికంగా, ఆధ్యాత్మికముగా, ఆర్థికముగా, ప్రాణపరంగా కష్టాలకు, నష్టాలకు గురి చేయుటకు ప్రయత్నించడం జరుగుతుంది. కాని మనకు మాత్రం హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం సహనంను వీడకూడదనే బోధనలను బోధించారు. ప్రత్యేకించి రమజాన్ మాసంలో సత్కార్యములు ఆచరించు విశ్వాసులకు, సహనంను ప్రదర్శించు విశ్వాసులకు అల్లాహ్ మరియు అతని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం స్వర్గపు శుభవార్త నిస్తున్నారు. కావున ఈ శిక్షణ భరితమైన ఈ మాసంలో ప్రత్యేకించి అహ్మదీయులు దుఆలు చేస్తూ, అస్తెఘ్ఫార్‌లు, నవాఫిల్‌లు చదువుతూ, సహనంను ప్రదర్శిస్తూ అల్లాహ్ తాలా ప్రీతిని పొందుటకు ఆపై స్వర్గమును తమ సామీప్యంనకు తెచ్చుకొనుటకు ప్రయత్నించవలెను. ఇలాంటి సత్కార్యములు చేయువారిని, కేవలం అల్లాహ్ ప్రీతిని పొందుటకు సత్కార్యములు చేయువారిని ఉద్దేశిస్తూ అల్లాహ్ తాలా ఈ విధముగా తెల్పుచున్నాడు. వ జజాహుం బిమా సబరు జన్నతన్ వ హరీర (అద్దహర్: 13) అనగా వారు సత్కార్యాములను కొనసాగించడం వలన, సహనంను ప్రదర్శించడం వలన వారికి స్వర్గమును, పట్టు వస్త్రాలను అనుగ్రహించడం జరుగుతుంది. కావున ఒకవేళ నేడు అహ్మదీయులపై దౌర్జన్యము జరుగుచున్నచో ఈ దౌర్జన్యము కేవలం మనం అల్లాహ్ తాలా ఆదేశానుసారంగా నడుచుకుంటున్నందుకే చేస్తున్నారనే విషయం అహ్మదీయులమైన మన అందరికి తెలుసు. అవతరించినటు వంటి ఇమాం మహ్దిని మనం విశ్వసించాము, అందుకే మనపై దౌర్జన్యము జరుగుచున్నది. శత్రువులను దౌర్జన్యము చేయనియ్యండి. మీరు సహనంను ప్రదర్శించండి. ఫలితముగా మనం అల్లాహ్ తాలా ప్రీతిని పొందువారమగుదుము. దౌర్జన్యం చేయువారిని అల్లాహ్ తాలా భయభ్రాంతులకు గురి చేశాడు. అవన్నియు పవిత్ర ఖుర్ఆన్‌లో నిండి యున్నాయి. ఇలా రెచ్చగొట్టేవారితో ఎలా వ్యవహరించును అనే విషయం అల్లాహ్ తాలాకే బాగుగా తెలుసు. కాని నేటి రోజులలో మనపై ఉన్నటువంటి బాధ్యత ఏమనగా, మానవతా దృక్పథంతో సాధారణముగా ముస్లిం సమాజం కరుణించబడాలని దుఆలు అధికముగా చేయాలి. ఇంతగా దౌర్జన్యం చేయువారి కొరకు ఎందుకు దుఆలు చేయాలని కొందరు అహ్మదీయులు ఆలోచిస్తుంటారు. ఇలాంటి సమయంలో మనం గుర్తుంచుకోవలసి విషయమేమనగా, ముసల్మానులలో అధికులు ధర్మము విషయంలో చాలా ఉద్రేకముతో ఉన్నారు. కాని ధార్మిక బోధనల పట్ల ఎలాంటి అవగాహనను కల్గి లేరు. లేదా ఉలమాలకు భయపడుతున్నారు. పేరుగాంచిన ధార్మిక పండితులే సామాన్య ప్రజానికాన్ని తప్పుడు మార్గంలో నడిపిస్తున్నారు.

కావున రమజాన్ మాసపు చివరి దశకంలో ఎంతో సహనాన్ని ప్రదర్శిస్తూ, దుఆలు చేస్తూ, నవాఫిల్ నమాజ్‌లు సల్పుచూ, ప్రాయశ్చిత్తములు, పాశ్చాత్తాపములు చేందుతూ, సత్కార్యములను కొనసాగిస్తూ, ఎల్లప్పుడు నిష్టాపరతను అనుసరించెదని ప్రతిజ్ఞ చేస్తూ , నరకం నుండి దూరముగా ఉంటూ, స్వర్గాన్ని పొందుటకు ప్రయత్నించు వారలము కావలెయును.

మనం ఈ రమజాన్ మాసం నుండి లబ్ధి పొందుతూ, అల్లాహ్ తాలా తెల్పినట్లుగా వ ఉజ్‌లిఫతిల్ జన్నతు లిల్ ముత్తఖీన్ (అష్షురా: 91) అనగా, నిష్టాపరులకు స్వర్గం దగ్గరికి చేయబడును. దూరం చేయబడదు. అని తెలుపబడిన వారిలో పరిగణింపబడాలి. హాజ మా తుఅదూన లికుల్లి

అవ్వాబిన్ హఫీజ్ (ఖాఫ్: 33). అనగా మీకు వాగ్దానం చేయబడింది ఇదియే. ఈ వాగ్దానం అల్లాహ్ ముందు మోకరిల్లు ప్రతి వ్యక్తికి, తమ సత్కార్యములను పరిరక్షించువారికి వర్తించును. అదే విధముగా అల్లాహ్ తాలా అనుగ్రహించినటు వంటి ధర్మశాస్త్రానికి అనుగుణముగా నడుచుకొనువారికి కూడ ఈ వాగ్దానం వర్తించును. కావున మనలోని ప్రతి ఒక్కరు ఈ రమజాన్ మాసంలో అల్లాహ్ మరియు అతని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తెల్పిన విధముగా నడుచుకొనుటకు ప్రయత్నించవలెను. ఈ చివరి దశకంలో కూడ ఈ శుభములను పొందుతూ, దేవుని ప్రీతిని పొందుతూ, అతని స్వర్గంలో ప్రవేశించు వారిగా మనలను అల్లాహ్ తీర్చిదిద్దునుగాకా!. సత్కార్యములను కొనసాగించు భాగ్యమును కూడ కల్పించుగాకా!.

నేడు మరల నేను జుమా నమాజ్ తరువాత కొన్ని పరోక్ష జనాజ నమాజ్‌లను చదువించెదను. చాలా బాధాకారమైన విషయమేమనగా, నేను గత జుమాలో మన ఒక అహ్మదీయ్య సోదరుడు గౌ॥ షేక్ సయీద్ అహ్మద్ గారు తమ కిరాణం దుకాణం వద్ద కూర్చున్న సమయంలో వారు అహ్మదీయులు అయినందున శత్రుత్వముతో వారిని తుపాకితో కాల్చినారు. వారు చాలా తీవ్రమైన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు, కావున దుఆ చేయమని కోరినాను. కాని వారు ఆసుపత్రిలో 12 రోజులు చికిత్స పొందినప్పటికి ప్రాణాలు కాపాడుకోలేక పోయారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్. అలా వారు కూడ అమరులైనారు. ఈ అమరుడు కూడ తన నవయవ్వంలోనే తన రక్తంను ధారపోసెను. వారికి 42 సంవత్సరాలు. గత సంవత్సరమే వారికి వివాహం జరిగింది. వారు గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తరుణంలోనే వారికి తొలిసారిగా కుమారుడు జన్మించాడు. వీరు కొంత సమయం స్పృహలోకి వచ్చినప్పుడు మీకు కుమారుడు జన్మించినాడని వారికి తెలియజేయడం జరిగింది. కాని వారు ఎలాంటి భావాలను వ్యక్తపర్చలేక పోయారు. కాని వారి కన్నుల నుండి కన్నీరు మాత్రం కారసాగాయి.

ఈ అమరుని కుటుంబంలో నుండే అనగా షేక్ సయీద్ గారి కుటుంబంలో నుండే గతంలో కూడ ముగ్గురు అమరులైనారు. వారి తండ్రి గారైన షేక్ బషీర్ గారికి అహ్మదీయులైనందున శత్రుత్వంతో విషం ఇచ్చి చంపడం జరిగింది. అలా వారు అమరులైనారు. మరల వారి సోదరుడు షేక్ ముహమ్మద్ రఫీఖ్ గారు మరియు వారి మామ గారైన ప్రొఫేసర్ డాక్టర్ షేక్ ముబష్షిర్ అహ్మద్ గార్లను కూడ తుపాకితో కాల్చి చంపడం జరిగింది. షేక్ ముబష్షిర్ అహ్మద్ గారిని ఈ సంవత్సరపు ప్రారంభములోనే కాల్చి చంపడం జరిగింది. ఇలా వీరు అమరులైనారు.

షేక్ సయీద్ గారు కూడ చాలా సున్నిత స్వభావం గలవారు. ఎల్లప్పుడు వారి ముఖములో చిరునవ్వు కనిపించేది. ఎంతో స్వచ్ఛమైన ధార్మిక సేవకుడు. ధార్మిక ప్రచారంలో ఎంతో ఉత్సాహంను ప్రదర్శించే వారు. 1990లో మౌల్వీలు వీరికి వ్యతిరేకముగా వ్యాజ్యమును మోపడం జరిగింది. ఫలితముగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఆ తరువాత పూచికత్తుపై బయటికి వచ్చారు. నేను ముందుగా తెల్పినట్లుగా వారి జ్ఞాపకార్థం వారి భార్య, వారి కుమారుడు, 72 సంవత్సరాల వారి తల్లి ఉన్నారు. ఈ వృద్ధాప్యంలో వారికి ఇది చాలా పెద్ద బాధ. వీరందరి కొరకు దుఆలు చేయండి.

గత జుమాలో నేను ఇద్దరు అమరులను గూర్చి ప్రస్తావించాను. వారిలో డాక్టర్ మన్నాన్ సిద్దీఖ్ గారి ప్రస్తావన వారి ప్రాంతంలో వారికి ఉన్నటు వంటి పరిచయం, వారి సేవలను ఉద్దేశించి చేయడం జరిగింది. పైగా మీర్‌పూర్ జిలా కూడ చాలా పెద్ద జిల్లా. ఆ జిల్లాలో జమాఅత్‌లు కూడ అధికముగా గలవు. అందుకు భిన్నముగా నవాబ్‌షా జిల్లా చిన్నది. ఎవరితో ఏ విధముగా వ్యవహరించాలనేది అల్లాహ్ తాలాయే బాగుగా ఎరుగును. మొత్తానికి ఇరువురు అమరుల స్థానాన్ని పొందినారు. గత కొన్ని రోజులుగా నికు కొన్ని వారి పట్ల విచారణ తెల్పు వ్రాసినటువంటి కొన్ని ఉత్తరాలు అందినాయి. వాటిలో ఒక చదువుకున్న పేరుప్రఖ్యాతలు గల వ్యక్తి కేవలం డాక్టర్ గారి ఇక్కరి పట్లనే విచారణ వ్యక్తం చేస్తూ వ్రాయడం జరిగింది. వాస్తవానికి నా వద్ద విచారణ వ్యక్త పర్చవలసి యున్నచో ఇరువురి పట్ల విచారణ వ్యక్త పర్చవలసి ఉండాలి. సేట్ సాహెబ్ గారితో కూడ నాకు పరిచయం గలదు. మౌనంగా ఉండేవారు, తమ బాధ్యతలను నెరవేర్చేవారు. ధార్మిక ఉత్సాహం, ఉద్రేకములు కల్గి యున్నటువంటి సేవకులు. నేను నౌబాషా ప్రాంతానికి ఎప్పుడు వెళ్ళిన కూడ, నేను చాలా సార్లు అక్కడికి వెళ్ళాను. ప్రత్యేకించి వారు నన్ను కలుసుకొనుటకు వచ్చేవారు. మీటింగ్‌లు ఏర్పాటు చేసేవారు. జమాఅత్ కార్యక్రమాలలో సలహాలు తీసుకునేవారు. ఆపై వాటిపై ఆచరించుటకు ప్రయత్నించేవారు. మొత్తానికి నేను వారి విషయంలో కొంత వివరణ ఇవ్వదలిచాను.

ఈ రోజు రెండవ పరోక్ష జనాజ నమాజ్ కూడ చదువించబడును. ఆ జనాజ మన సిరియాకు చెందిన సోదరి అయినా మర్వల్ ఘాలుల్ సాహెబా గారిది. వీరు నడుచుకుంటూ వెళ్ళుచుండగా వెనుక నుండి ట్రక్ లేదా మరేదో ఒక వాహనం తగిలింది. కొన్ని రోజుల వరకు వీరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉన్నారు. కాని చివరికి మృతి చెందారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్. వీరికి 24 సంవత్సరాల వయస్సు. వీరు కూడ మన అరబి వెబ్‌సైట్‌లోని అజ్ విబత అనిల్ ఈమాని అనే కార్యక్రమములో ఎంతో కృషితో సేవలందించేవారు. వారు అన్ని రకాల కఠిన పనులన్ని ఆ కార్యక్రమాల కోసం చేశారు. అదే విధముగా అల్ ఇస్లామ్ వెబ్‌సైట్‌లో కూడ జకాత్ అనే అంశంపై ఆంగ్లంలో వ్రాయబడిన ఒక పుస్తకాన్ని అరబి బాషలోకి అనువాదించారు. ఈ పుస్తకపు అనువాదం పూర్తి అయిన తరువాత వాస్తవానికి వీరు దానిని పుస్తక రూపం దాల్చునట్లు చేయుటకు ప్రిటింగ్ ప్రెస్‌కు వెళ్ళుచున్నారు. అలా మార్గమధ్యలోనే ప్రమాదానికి గురైనారు. ఎంతో ఉత్తమురాలు. నిష్ఠాపరత గలవారు, సేవా దృక్పథంను కల్గి ఉన్నవారు. నాకు ధార్మిక సేవచేయు భాగ్యము లభించాలని పదే పదే ఆశించేవారు. వారి కాబోయే భర్త ముహమ్మద్ మిలిస్ గారు ఇక్కడే ఎం.టి.ఏ అల్ అరబియాలో సేవలందిస్తున్నారు. త్వరలోనే వారి వివాహం జరుగవలసి యుండెను. మొత్తానికి అల్లాహ్ విధి. అల్లాహ్ తాలా వారిని కనికరించుగాకా!, వారి స్థాయిని పెంచుగాకా!, వారి కుటుంబీకులకు సహనంను, ఓర్పును ప్రసాదించుగాకా! .

## ఉపదేశము : హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం

**" మీరు నా ఈ మాటలను బహుశ ఎక్కడా విను భాగ్యము లేని ఒక వ్యక్తి వాగ్మూలాలుగా భావించి, ఆదర్శప్రాయముగా నిలుచునట్లుగా వాటిని ఆచరించుము......... ఒకవేళ మీరు ఇలా నడుచుకోలేక పోవుచున్నచో, ఆచరించలేక పోవుచున్నచో ఈ జమాఅత్‌లో చేరడం వెనుక ఉన్న మీ ఉద్దేశం ఏమిటో నాకు తెల్పండి?. నేను చాటు మాటు మార్పును ఆశించడం లేదు. బహిర్గతమైన మార్పును ఆశిస్తున్నాను." (మల్ఫూజాత్ సంపుటి 1, పుట 125)**

**SUFI AHMAD** Jama'at Ahmadiyya Penugonda, Dist: West Godawari (Andhra Pradesh)

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9493113322
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail: badartel001@gmail.com

REGISTERED WITH THE REGISTER OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817
Weekly BADAR Qadian బదర్ వార పత్రిక ఖాదియాన్
Distt: Gurdaspur (Pb.) INDIA Qadian - 143516
POSTAL REG NO GDP-38/2020-2022, Vol. 5. Thursday, 21 MAY 2020 Issue No. 21.

MANAGER
NAWAB AHMAD
Mobile. : +91 94170-20616
e-mail:managerbadrqnd@gmail.com
website:www.akhbarbadarqadian.in
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.500/- (Per Issue: 9/- ) (WEIGHT: 20-50, grms / issue)

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz